PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 94 | విజయవాడ, బుధవారం 5 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 5 November 2025 | Rs

అడవి పెరిగేదెన్నడు?

- ఇప్పుడున్నది 22.96 శాతమే
- 2029 నాటికి లక్ష్యం 37 శాతం

2

తెర వెనుక సారథి మజుందార్

- జాతీయ జట్టుకు ఆడకున్నా... ప్రపంచకప్ అందించిన కోచ్
- నేడు ప్రధానిని కలవనున్న జట్టు



6

తిరుపతి బస్టాండ్‌పై అదాని కన్ను!

- 2 వేల కోట్ల ఆస్తులు కట్టబెట్టడానికి రంగం సిద్ధం
- త్వరలో టెండర్లు?

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

రాష్ట్రంలో ప్రతిష్టాత్మక బస్టాండ్లలో ఒకటైన తిరుపతి బస్టాండ్‌పై అదాని కన్ను పడినట్లు సమాచారం. ఈ బస్టాండ్‌ను భారీ ఎత్తున ఆధునీకరించి, అల్ట్రా మోడర్న్ ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్‌ను ప్రైవేటు భాగస్వామ్యంతో పిపిపి పద్ధతిలో నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఎపిఎస్‌ఆర్‌టిసి భూమిని ఇస్తుంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్) కొంత నిధులను సమకూరుస్తుంది. మిగిలిన నిధులను నిర్మాణంలో భాగమయ్యే ప్రైవేటు సంస్థ భరించాల్సిఉంటుంది. దీనికి సంబంధించి డిపిఆర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యింది. ఈ దశలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడుగా గుర్తింపు పొందిన అదాని ఈ ప్రాజెక్టు పట్ల ఆసక్తి చూపుతున్నారన్న విషయం ఆర్‌టిసి వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉన్నతస్థాయి అధికారులు అయితే ప్రాజెక్టు పనులు అదానికి ఖరారు అయినట్లుగానే మాట్లాడుతుండటం విశేషం.

13.5 ఎకరాల్లో విస్తరించి ఉన్న తిరుపతి సెంట్రల్ బస్టాండ్ స్థలం విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం సుమారు 2వేల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా! అయితే, పిపిపి పద్ధతిలో చేపట్టనున్న అల్ట్రా మోడల్ బస్ టెర్మినల్‌ను 500 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిపాదించడం గమనార్హం. దీనిలో ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్ వాటా పోనూ నిర్మాణ సంస్థ ఎంత భరించాల్సి ఉంటుందన్నది ఇంకా స్పష్టం కాలేదు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియ పూర్తయి ఇప్పటికే పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే, అస్మదీయులకు లబ్ధి చేకూర్చే వ్యూహంలో భాగంగానే టెండర్ ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ప్రస్తుత బస్టాండ్‌ను కూల్చివేస్తున్న దృశ్యం



నూతనంగా నిర్మించే టెర్మినల్ (ఊహా చిత్రం)

అదాని కోసమేనా...?

ప్రైవేటు భాగస్వామ్యంతో అల్ట్రా మోడల్ బస్ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక కసరత్తు ఇప్పటికే పూర్తయింది. ఈ ఏడాది మార్చి 13న తిరుపతి ఎంపి ఎం. గురుమూర్తి అడిగిన ప్రశ్నకు పార్లమెంటులో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పిపిపి విధానంలో చేపడుతున్న ఈ ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ ఇప్పటికే పూర్తయిందని చెప్పారు. ప్రాజెక్టులో భాగస్వాములు ఇచ్చిన 'ఇన్‌పుట్'లో భాగంగా డిజైన్‌లో తుది మార్పులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి దాకా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఈ ప్రాజెక్టులో భాగస్వాములు! కీలకమైన ప్రైవేటు భాగస్వామి ఎవరో టెండర్ల ప్రక్రియ పూర్తయితే కానీ తేలదు. అయితే, కేంద్ర మంత్రి 'భాగస్వాములు ఇచ్చిన ఇన్‌పుట్'లతో డిజైన్‌లో తుది మార్పులు చేస్తున్నట్లు చెప్పడం ఆసక్తి కరంగా మారింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర చర్చల తరువాతనే డిపిఆర్ రూపొందగా, కొత్తగా 'ఇన్‌పుట్స్' ఇచ్చిన భాగస్వామి ఎవరో కేంద్ర మంత్రి చెప్పలేదు. బస్ టెర్మినల్‌కు అత్యంత ముఖ్యమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తున్నా కేంద్రప్రభుత్వానిదే కీలక పాత్ర కావడం కూడా ప్రాజెక్టు అదానికే దక్కనుందన్న అనుమానాలు వ్యక్తం కావడానికి మరో కారణం. నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని కేంద్ర మంత్రి పార్లమెంటులో చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ ప్రాజెక్టుపై ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్, ఆర్‌టిసి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన డిజైన్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. టెండర్ల ప్రక్రియ జాప్యం కావడానికి ఇది కూడా ఒక కారణం. అయితే, అస్మదీయులకు లబ్ధి చేసే మిగతా 7లో

ఆర్‌టిసికి నష్టం : ఎస్‌డబ్ల్యుఎఫ్

పిపిపి పద్ధతిలో జరుగుతున్న టెర్మినల్ నిర్మాణం ఆర్‌టిసికి నష్టం చేస్తుందని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య తెలిపారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఇదే పద్ధతిలో నిర్మించిన గుజరాత్‌లోని వడోదర టోర్మినల్‌ను ఎపిఎస్ అర్‌టిసి అధికారులు, రవాణా రంగ అధికారులు అధ్యయనం చేశారని, ఎస్‌డబ్ల్యుఎఫ్ తరపున లక్షయ్య, తాను వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. దేశంలోనే ఈ తరహాలో మొదట వడోదరలో ఇటువంటి నిర్మాణాన్ని చేపట్టారని ఆయన తెలిపారు. దానిలో ఆర్‌టిసికి ఒక మూల స్థలం కేటాయించారని, ప్రైవేటు బస్సులు కూడాఈ బస్ స్టేషన్ను వినియోగించుకుంటున్నాయని పేర్కొన్నారు.

ఫలితంగా ఆర్‌టిసికి రావాల్సిన ఆదాయం ప్రైవేటు వారికి వెళ్తోందని వివరించారు. మన రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాలో ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని గతంలో టిడిపి ప్రభుత్వం ప్రణాళిక వేసిందని, ఆ తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం దానిని నిలిపివేసిందని పేర్కొన్నారు.



బిలాస్‌పుర్ వద్ద జరిగిన ప్రమాదంలో గూడ్సుపైకి ఎక్కిన పాసింజర్ రైలు

ఛత్తీస్‌గఢ్‌లో ఘోరం

- బిలాస్‌పూర్ వద్ద రైళ్లు ఢీ
- 8 మంది మృతి, 20 మందికి గాయాలు

బిలాస్‌పూర్ : ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాస్‌పూర్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో మంగళవారం పాసింజర్ రైలు, గూడ్స్ రైలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎనిమిది మంది మరణించగా, 20 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. విచారణకు రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సాయంత్రం 4 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కోర్బా జిల్లాలోని గెవ్రా నుండి పాసింజర్ రైలు బిలాస్‌పూర్‌కు వెళుతోంది. గటోరా, బిలాస్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య పాసింజర్ రైలు వెనుక నుండి గూడ్స్ రైలులోకి దూసుకుపోయింది. ప్రమాద తీవ్రతకు గూడ్స్ రైలు వ్యాగన్ పైకి ప్రయాణికుల రైలు కోచ్ ఒకటి పూర్తిగా ఎక్కేయడం కనిపిస్తోంది. కోచ్ కింద చిక్కుకున్న వారిని వెలికి తీయడానికి హైడ్రాలిక్ కట్టర్‌లను ఉపయోగిస్తున్నారు. బిలాస్‌పూర్ రైల్వేచీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సుస్కర్ విపుల్ విలాస్‌రావు విలేకర్లతో మాట్లాడుతూ, రైళ్ల వేగానికి సంబంధించి అడిగిన ప్రశ్నలకు స్పందించారు. ఒకే ట్రాక్‌పై ఒక రైలు వెనుక మరో రైలు వెళ్ళడమనేది సాధారణ కార్యకలాపాల్లో భాగమేనని చెప్పారు. రైల్వే భద్రతా కమిషనర్ విచారణ తర్వాత గానీ సరైన కారణాన్ని వెల్లడించలేమని అన్నారు.

నష్టపరిహారం

మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి లక్ష చొప్పున నష్టపరిహారాన్ని రైల్వే ప్రకటించింది. హెల్ప్‌లైన్‌లను కూడా ఏర్పాటు చేశారు.

ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా బిలాస్‌పూర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు.

ప్రాణాలు తోడేస్తున్న విద్యాసంస్థలు

- ఒకేరోజు నలుగురు విద్యార్థులు ఆత్మహత్య

7



బ్రిటన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమావేశమైన భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి

చంద్రబాబుతో భారత హైకమిషనర్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం చంద్రబాబుతో లండన్‌లోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యుకెలోని వివిధ యూనివర్సిటీలు రాష్ట్రంతో నాలుగు అంశాల్లో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకునే అంశంపై చర్చించారు.

కేంద్ర సహకారంతో జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేసుకునే అంశంతోపాటు, అక్కడి యూనివర్సిటీలు ఇక్కడి విద్యాసంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునే అంశంపై చర్చించారు. యూనివర్సిటీలు, విద్యాసంస్థల మధ్య విద్యార్థుల ఎక్స్ఛేంజ్ అంశంతో పాటు లైఫ్ సైన్సెస్, బయో జెనెటిక్స్, ఖనిజాల వెలికితీత, మెటల్స్ అంశాల్లో ఏపి, యుకె యూనివర్సిటీల మధ్య భాగస్వామ్యాల ఏర్పాటు, ఎఐ, సెమీ కండక్టర్, స్పేస్ టెక్నాలజీ, కోర్ ఇంజినీరింగ్, మెరైన్ ఇండస్ట్రీ 4.0లో సహకారం గురించి వీరి మధ్య చర్చలు జరిగాయి.

నేడు పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిన నేపథ్యంలో బుధవారం నాడు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కడప, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మంగళవారం సాయంత్రం నాటికి బాపట్లలో 61.5 మిల్లీమీటర్లు, నంద్యాల జిల్లా నందికొట్కూరులో 51.7, బొల్లవరంలో 43.5 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైందని తెలిపారు.

రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్శిటీ స్థాపించాలి

- మంత్రి లోకేష్‌కు వి. శ్రీనివాసరావు లేఖ

2

ఎన్యూమరేషన్లో అక్రమాలు

- ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా చెల్లింపులో ప్రభుత్వం విఫలం : జగన్
- కృష్ణా జిల్లాలో దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను ఎన్యూమరేషన్ చేయడంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహనరెడ్డి విమర్శించారు. నష్టపోయిన పంట పొలాల్లో ఇ-క్రాప్ ఆధారంగా రైతుల ఫొటోలను జిపిఎస్ చేసి ఎన్యుమరేషన్ చేయకుండా టిడిపి నేతల ఇళ్ల వద్దే చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గుంటూరు జిల్లాలోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూముల విస్తీర్ణాన్ని 112 నుంచి 128 శాతం ఎన్యుమరేషన్ చేయడం టిడిపి నేతల అక్రమాలకు అద్దం పడుతోందని విమర్శించారు. కృష్ణా జిల్లాలో మొంథా తుపానుకు దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. పెనమలూరు మండలం గోసాల, కంకిపాడు, ఉయ్యూరు మండలం గండిగుంట, పామర్రు, గూడూరు, మచిలీపట్నం మండలం సీతారామపురం, ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామాల్లో మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పంటలను రైతులు ఆయనకు చూపారు. గూడూరు మండలం రామరాజుపాలెంలో దెబ్బతిన్న వరి పొలాలను గట్టుమీదుగా జగన్ లోపలకు వెళ్లి పరిశీలించారు. ఆ గ్రామానికి చెందిన రైతులు కోమటి సాయిబాబు, పరిసె వెంకటేశ్వరరావు, గణేశన రమేష్‌బాబు, దేసు ప్రసాద్... తుపాను వల్ల వరి పంటకు జరిగిన నష్టాన్ని ఆయనకు వివరించారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 11 లక్షల ఎకరాల్లోపైగా వరి, నాలుగు లక్షల ఎకరాల్లో అరటి, బొప్పాయి, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. నష్టం వాటిల్లిన పంటలను సరిగా ఎన్యుమరేషన్ చేయడంలేదని, కేవలం ఒకటి రెండు రోజుల్లో ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని మిగతా 7లో



గూడూరు మండలం రామరాజుపాలెంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న జగన్

రైతులకు ఉచిత విద్యుత్

- వరికి రూ.300, గోధుమకు రూ.400 బోనస్
- ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ హామీ
- బీహార్‌లో ముగిసిన తొలిదశ ప్రచారం



బీహార్‌లో చెరియాలోని ఎన్నికల ప్రచారంలో తేజస్వి యాదవ్, ఇండియా బ్లాక్ నాయకులు

పాట్నా : తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఉచిత విద్యుత్ అందజేస్తామని, కనీస మద్దతు ధర కంటే వరికి క్వింటాలుకు రూ.300, గోధుమలకు రూ.400 చొప్పున బోనస్‌గా ఇస్తామని ఆర్‌జెడి నాయకులు, ఇండియా బ్లాక్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ రైతులకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలు (పిఎసిఎస్), ప్రాథమిక మార్కెటింగ్ సహకార సంఘాల (వ్యాపర్ మండల్) అధ్యక్షులకు 'ప్రజాప్రతినిధుల హోదా' ఇస్తామని చెప్పారు. పాట్నాలో మీడియా సమావేశంలోనూ, చెరియా తదితర ప్రాంతాల్లో ఎన్నికల సభల్లోనూ ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్‌లో ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే రైతులకు నీటిపారుదల ప్రయోజనాల కోసం ఉచిత విద్యుత్ అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఎన్‌డిఎ ప్రభుత్వం వ్యవసాయ కార్యకలాపాలలో ఉపయోగించే విద్యుత్‌కు రైతుల నుంచి యూనిట్‌కు 55 పైసలు చొప్పున వసూలు చేస్తోందని విమర్శించారు. 'మై-బహిన్ మాన్ యోజన' ప్రారంభిస్తామన్నారు. జనవరి 14న సంక్రాంతి రోజున రాష్ట్రంలోని మహిళలకు రూ.30వేలు కానుకగా అందజేస్తామని వెల్లడించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం మహిళలకు ఇటీవల నవరాత్రి కానుకగా ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో నగదు జమ చేసింది. గతవారంలో విడుదల చేసిన ఇండియా బ్లాక్ మ్యానిఫెస్టో ప్రకారం.. డిసెంబర్ 1 నుంచి వచ్చే ఐదేళ్ల వరకూ మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అంటే సంవత్సరానికి మొత్తం రూ.30,000 ఇవ్వనున్నారు. దీనినే సంక్రాంతికి మహిళల ఖాతాల్లో రూ.30 వేలు చొప్పున జమ చేస్తామని తేజస్వి యాదవ్ చెప్పారు. ద్రవ్యోల్బణం భారీగా పెరిగిన ఈ సమయంలో ఈ పథకం మహిళలకు ఎంతో ప్రయోజనం మిగతా 7లో



ఫోన్‌లో.. పోస్టాఫీస్!

- 'డాక్ సేవ' యాప్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ : భారత తపాల శాఖ అందిస్తున్న సేవలన్నీ ఇక ఫోన్‌లోనూ అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన 'డాక్ సేవ' యాప్‌ను మంగళవారం ఆవిష్కరించింది. 'ఇక పోస్టాఫీస్ మీ జేబులోనే' అంటూ తపాల శాఖ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. తపాల శాఖ అందించే పార్సిల్ ట్రాకింగ్, పోస్టేజ్ కోసం అయ్యే ఖర్చులు, ఫిర్యాదు నమోదు, బీమా ప్రీమియం చెల్లింపు వంటి వివిధ రకాల సేవలను పొందొచ్చు. స్పీడ్‌పోస్ట్, మనీ ఆర్డర్ వివరాలను రియల్‌టైమ్‌లో ట్రాక్ చేసుకోవచ్చు. దేశీయ, అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఎంత ఛార్జీ అవుతుందో తక్షణమే లెక్కించుకోవచ్చని తెలిపింది.

రాష్ట్రంలో 359 రూర్బన్ పంచాయతీలు

- క్లస్టర్ల వ్యవస్థ రద్దు
- అమలులోకి నాలుగు గ్రేడ్ల విధానం
- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్న 7,244 క్లస్టర్ల గ్రామ పంచాయతీల వ్యవస్థను రద్దు చేసింది. నాలుగు గేడ్లుగా 13,351 పంచాయతీలను విభజించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 359 రూర్బన్ (రూరల్, అర్బన్) పంచాయతీలను ఏర్పాటు చేశారు. వీటిని స్పెషల్ గ్రేడ్‌లో ఉంచారు. గ్రేడ్ 1లో 3,082 పంచాయతీలను, గ్రేడ్ 2లో 3,163 పంచాయతీలను, గ్రేడ్ 3లో 6,747 పంచాయతీలను ఉంచారు. రూర్బన్ పంచాయతీల్లోని గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శుల పోస్టులను అప్ గ్రేడ్ చేసి పంచాయతీ అభివృద్ధి అధికారి (పిడిఒ)గా మార్చారు. జూనియర్ అసిస్టెంట్‌లకు పోస్టులను సీనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారు. పంచాయతీ కార్యదర్శుల పోస్టులను పంచాయతీ అభివృద్ధి అధికారిగా మార్చారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య విభాగం, నీటి సరఫరా విభాగం, గ్రామ ప్రణాళిక విభాగం, వీధి దీపాలు, ఇంజనీరింగ్ విభాగం, రెవెన్యూ విభాగాలతో కూడిన నమూనాను ఆమోదించినట్లు పేర్కొన్నారు. వీరికి అయ్యే వ్యయాన్ని పంచాయతీల సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణాలు, లేఅవుట్ అమలు వంటి వృత్తిపరమైన సేవలను అందించడం కోసం గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్ల సేవలు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. నేరుగా నియామకం పొందిన డిప్యూటీ ఎంపిడిఒలను శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం కనీసం మూడు సంవత్సరాల పాటు రూర్బన్ పంచాయతీ అభివృద్ధి అధికారులుగా నియమించనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

- దుబాయ్ కంపెనీలకు మంత్రి నారాయణ ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని దుబాయ్ కంపెనీలను మంత్రి నారాయణ కోరారు. పెట్టుబడుల ఆహ్వానంలో భాగంగా దుబాయ్‌లో పర్యటిస్తున్న మంత్రి నారాయణ, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబుతో కూడిన బృందం రెండోరోజు పలు కంపెనీల ప్రతినిధులతో చర్చించింది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను, పాలసీలను పరిశీలించాలని మంత్రి నారాయణ కోరారు. మంగళవారం అపెరల్ గ్రూప్ ఛైర్మన్ నీలేష్ వేద్, సిఇఒ నీరజ్, సిబిఒ కమల్ కోటక్‌తో సమావేశమయ్యారు. ఫ్యాషన్‌వేర్, గార్మెంట్స్, ఫుట్‌వేర్, కాస్మోటిక్స్ రంగాల్లో 14 దేశాల్లో 2,300 స్టోర్లను అపెరల్ గ్రూప్ నిర్వహిస్తోంది. అలాగే ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్ ఛైర్మన్ రమేష్ రామకృష్ణన్‌తో మంత్రి నారాయణ బృందం భేటీ అయ్యింది. షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగంలో దుబాయ్ కేంద్రంగా అనేక దేశాల్లో ఈ సంస్థ వ్యాపారాలు నిర్వహిస్తోంది. బుర్జిల్ హెల్త్‌కేర్ ప్రతినిధులతోనూ చర్చించారు. అలాగే దుబాయ్‌లోని తబ్రీద్ కంపెనీ క్వార్టర్స్‌ను మంత్రి పరిశీలించారు. బుర్జ్‌ఖలీఫా, దుబాయ్‌మాల్ వంటి సంస్థలకు కూలింగ్ సిస్టమ్స్ అందిస్తున్న తబ్రీద్ కంపెనీని అమరావతిలో సేవలు అందించాల్సిందిగా కోరారు. వీరందరికీ విశాఖ సిఐఐ సమ్మిట్ గురించి వివరించారు.

వృత్తిదారులకు శాశ్వత ఉపాధి

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోటీ ప్రపంచంలో కుల, చేతి వృత్తిదారులు నిలదొక్కుకునేలా ఆధునిక పరికరాలు అందజేసి, శాశ్వత ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. బిసి కులాల కార్పొరేషన్ ఛైర్మన్‌లకు నిధులు, విధులతోపాటు తగిన గౌరవాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విజయవాడ సమీపంలోని గొల్లపూడి బిసి భవన్‌లో మంగళవారం పలు కార్పొరేషన్ల ఛైర్మన్‌లు, డైరెక్టర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లతోపాటు ట్రాక్ సూట్‌లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బిసి నిరుద్యోగ యువతకు డిఎస్‌సి, సివిల్ సర్వీసెస్‌లో కోచింగ్ ఉచితంగా అందజేసి, ఉద్యోగాలు పొందేలా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.వెయ్యి కోట్లతో ఆదరణ 3.0 పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఏ వృత్తిదారునికి ఎటువంటి పరికరాలు ఆశిస్తున్నారో తెలుసుకునేందుకు సర్వే తరహాలో వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. 16 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఛైర్మన్లు, డైరెక్టర్లపై ఉందన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, ఆయా కార్పొరేషన్ల ఛైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

33% పైగా నష్టం జరిగితేనే పరిహారం

- ఇ-క్రాప్‌లో నమోదైన వారికే అవకాశం
- ప్రాథమిక, తుది అంచనాలకు భారీ వ్యత్యాసం



తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో అరటిపంటను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఇటీవల కురిసిన మొంథా తుపానుతో నష్టపోయిన పంటలకు జరుగుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియలో ప్రాథమిక అంచనాలకు, ప్రస్తుతం అధికారులు నమోదు చేస్తున్న నష్టాలకు పొంతన కుదరడం లేదు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టం అంచనాల్లో అధికారులు భారీగా కోత విధిస్తున్నారు. 33 శాతంకుపైగా పంట నష్టం జరిగితేనే వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రధానంగా ఇ-క్రాప్ నమోదు చేసుకోని రైతులకు పంట నష్టం జరిగినా నమోదును మినహాయించారు.

పల్నాడు జిల్లాలో మొత్తంగా 87 శాతం మందికి ఇ-క్రాప్ నమోదు చేయగా కొన్ని మండలాల్లో 75 నుంచి 79 శాతం మాత్రమే ఇది జరిగింది. గుంటూరు జిల్లాలో తొలుత 60 వేల ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. తుది అంచనాల్లో భారీగా కోత విధించారు. 23 వేల ఎకరాల్లో పత్తికి నష్టం జరిగిందని తొలుత అంచనా వేయగా తుది అంచనాల్లో కేవలం కేవలం 80 ఎకరాల్లోనే నష్టాన్ని నిర్ధారించారు. 1100 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిందని, ఉద్యాన పంటలకు సంబంధించి 2913 మంది రైతులకు చెందిన 3850 ఎకరాల్లోనే అరటి, పసుపు, కూరగాయలు, తమలపాకు, బొప్పాయి, మిర్చి పంటలకు నష్టం జరిగిందని అంచనాలు రూపొందించారు. పల్నాడు జిల్లాలో 60 వేల ఎకరాల్లో పంటలు నష్టం జరిగిందని అంచనాలు రూపొందించగా తుది అంచనాల్లో కేవలం ఆరు వేల ఎకరాల్లోనే నష్టం జరిగినట్టు చూపారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1.06 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు ఇప్పటి వరకూ అధికారులు ధ్రువీకరించారు. తుపాను సమయంలో ఈ నష్టం 2.24 లక్షల వరకు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. 33 శాతం పంట నష్టం కలగలేదనే కారణంతో సుమారు లక్షకుపైగా ఎకరాలను నమోదు చేయనట్టు స్పష్టమవుతుంది. చాలా మంది రైతులు ఇ-క్రాప్‌లో నమోదు కాలేదు. బీమా ప్రీమియం కూడా చెల్లించలేదు. దీంతో వారికి నష్ట పరిహారం అందేవిషయమై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పంటల బీమాను పునరుద్ధరించాలి



గతంలో ప్రభుత్వమే బీమా చేసేది. ప్రస్తుతం దీన్ని నిలిపేయడంతో చాలా నష్టపోయాం. బీమా ఉంటే చాలా వరకూ గట్టెక్కేవాళ్లం. మూడు ఎకరాల్లో వరి పంట వేశాను. ఎకరాకు 40 బస్తాల వరకూ దిగుబడి వస్తుందనుకున్నాను. తుపాను వల్ల పంట మొత్తం నీట మునిగింది. ఎకరాకు 15 బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదు. మూడు ఎకరాలకు రూ.75 వేలకుపైగా పెట్టుబడి పెట్టాను. చేతికి రూ.20 వేలు కూడా వచ్చేది కష్టమే. ప్రభుత్వం ఆదుకోకుంటే అప్పులపాలవుతాము.

- కోలా నాగేశ్వరరావు , రామచంద్రపురం, డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

బాధితులకు అండగా ఉంటాం

- దళితులపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

బాధితులకు న్యాయం చేకూరే వరకూ తమ పార్టీ అండగా ఉంటుందని సిపిఎం ఒంగోలు జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు భరోసా ఇచ్చారు. చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామంలో సోమవారం దళితులపై పెత్తందారులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సిపిఎం బృందం మంగళవారం పరామర్శించింది. పెత్తందారులు ఒనిపెంట శ్రీనివాసులురెడ్డి, గోపిరెడ్డి బాలఓబుల్‌రెడ్డి సమక్షంలో వారి అనుచరులు మూకుమ్మడిగా దళితులపై దాడిచేసి.. తీవ్రంగా గాయపరిచిన ఘటన పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. మాణిక్యరావును విజ్ఞప్తి చేశారు. అనంతరం బండ్లమూడి గ్రామాన్ని సందర్శించి దాడికి గురైన కుటుంబాలను పరామర్శించి, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దళితుల పొలంలో గొర్రెలు మేస్తున్న సమయంలోనే దాడికి పాల్పడ్డారని స్థానికులు వివరించారు. దళితులపై దాడులకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మాబు డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామంలో పోలీస్ పికెట్

బండ్లమూడి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ గొడవ గొర్రెల వివాదం దగ్గర మొదలైందన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య వ్యక్తిగత కారణాలతో మాత్రమే జరిగిందని, రెండు కులాల మధ్య వివాదం కాదని పేర్కొన్నారు. రెండు కేసులు విచారణలో ఉన్నాయన్నారు. తప్పుదారి పట్టించే సమాచారం, వదంతులు, లేదా కుల విభేదాలు రేకెత్తించే పోస్టులు సోషల్ మీడియాలో ప్రచారం చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామీణ రోడ్లకు రూ.2 వేలకోట్లు

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామాల్లో నూతన రోడ్లను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్స్) పథకంలో భాగంగా రాష్ట్రానికి రూ.2 వేలకోట్ల నిధులను సమకూర్చిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకునేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. రహదారుల నిర్మాణంలో నిబంధనలకు అనుగుణంగా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా అనే అంశాన్ని పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు ముందుగానే నాణ్యత ప్రమాణాల గురించి పూర్తి స్థాయి అవగాహన కల్పించాలన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రూ.35 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. శ్రీ సత్యసాయి బాబా వర్ధంతి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రోడ్ల నిర్మాణాల విషయంలో గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించిందన్నారు.

అడవి పెరిగేదెన్నడు?

ఇప్పుడున్నది 22.96 శాతమే
2029 నాటికి లక్ష్యం 37 శాతం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెంపొందిస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు ఎప్పటికి కార్యరూపం దాల్చుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఏటా లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నప్పటికీ అవి అమలులోకి మాత్రం రావడం లేదు. 2029 నుంచి 2047 వరకు భిన్న లక్ష్యాలను ఇప్పటికే ప్రకటించినప్పటికీ ఆశయ సాధనలో ఎంతవరకు ఫలిస్తాయన్నది ఇప్పుడే చెప్పలేమని సాక్ష్యాత్తూ అటవీ శాఖ అధికారులే వ్యాఖ్యానిస్తుండడం విశేషం. తాజాగా వెలుగుచూసిన ఒక నివేదిక మేరకు రాష్ట్రంలో 22.96 శాతం మాత్రమే పచ్చదనం ఉన్నట్లు తేలింది. రాష్ట్రంలో మొత్తం 1.63 లక్షల చదరపు కిలోమీటర్ల భూమి ఉంది. అందులో కేవలం 37,421 చదరపు కిలోమీటర్ల మేరకు మాత్రమే అటవీ భూమి ఉంది. ఇది మొత్తం విస్తీర్ణంలో 22.96 శాతంగా ఉంది. ఈ అటవీ భూమిలో కూడా దట్టమైన అడవి 5.19 శాతంతో 1,925 చదరపు కిలోమీటర్లు ఉండగా, మధ్యస్థ దట్టమైన అడవి 12,469 చ.కిమీ మాత్రమే ఉంది. ఇక బయట అటవీ ప్రాంతం 9,492 చ.కిమీ ఉండడం, ముళ్లపొదలు, గడ్డి భూములు, నీటి వనరలున్న ప్రాంతాలు కలిపి మరో 13 వేల చదరపు కిలోమీటర్లవరకు ఉన్నట్లు తేలింది. అయితే తాజాగా పచ్చదనాన్ని మరింతగా పెంచేందుకు దశలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం విశేషం.

50 శాతం లక్ష్యంగా...

దశలవారీ లక్ష్యాల్లో భాగంగా మొత్తం 50 శాతం వరకు పచ్చదనం ఉండేలా చూడాలని నిర్దేశించుకున్నారు. 2029 నాటికి 37 శాతం వరకు గ్రీన్ కవర్ లక్ష్యం సాధించాలని నిర్ణయించుకున్న ప్రభుత్వం 2034 నాటికి 42 శాతం, 2039 నాటికి 47 శాతం, 2047 నాటికి 50 శాతం లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించింది. ఇలా 50 శాతం లక్ష్యం సాధించాలంటే మరో 33 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో పచ్చదనం పెంచాల్సి ఉంటుంది. ఇది ఎంతవరకు సాధ్యమన్నది అందరిలో నెలకొన్న ప్రశ్న.

తొమ్మిది జిల్లాల్లోనే పచ్చదనం

ఇప్పటివరకు ఉన్న గణాంకాలను పరిశీలిస్తే కేవలం తొమ్మిది జిల్లాల్లోనే ఎక్కువ పచ్చదనం ఉన్నట్లు తేలింది. మరో పది జిల్లాల్లో మధ్యస్థ అటవీ ప్రాంతం ఉండగా, ఏడు జిల్లాల్లో అతి తక్కువ పచ్చదనం ఉన్నట్లు గుర్తించారు. అల్లూరి సీతారామరాజు, మన్యం, తిరుపతి, అన్నమయ్య, ప్రకాశం, ఏలూరు, అనకాపల్లి, చిత్తూరు, నంధ్యాల జిల్లాల్లో ఎక్కువగా గ్రీన్ కవర్ కనిపిస్తోంది. గుంటూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి వంటి జిల్లాల్లో అడవులు ఉన్నప్పటికీ అక్కడ అడవుల పెంపకంపై పెద్దగా దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

లక్ష్యాలు భారీగానే

అటవీకరణ చేసేందుకు మాత్రం భారీగానే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 50 శాతం గ్రీన్‌కవర్ సాధించేందుకు అటవీశాఖనే నోడల్ ఏజెన్సీగా ప్రకటించారు. ఉపాధి హామీ పథకం ద్వారా భారీగా మొక్కలు నాటడం, గ్రామీణ స్థాయిలో నర్సరీలు ఏర్పాటుచేయడం వంటి బాధ్యతలను పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పగించాలని, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం బాధ్యతను మున్సిపల్ శాఖకు, నీటిని సమకూర్చే బాధ్యతను ఇరిగేషన్ శాఖకు, సిఎస్‌ఆర్ విధానంలో పచ్చదనం బాధ్యత పరిశ్రమలశాఖకు, ఇలా విద్యాశాఖ, రవాణా, రోడ్లు భవనాలు, రెవెన్యూ, పర్యాటక శాఖలకు కూడా మరిన్ని బాధ్యతలు అప్పగించారు. అయితే ఇది ఎంతవరకు సఫలీకృతం అవుతాయన్నది చర్చనీయాంశంగా మారింది.



ఆటో జాతాను జెండా ఊపి ప్రారంభిస్తున్న జగ్గునాయుడు

అదాని సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయండి

- సిపిఎం ఆధ్వర్యాన ఆటో జాతాలు ప్రారంభం

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)


ప్రజలకు, పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూర్చే అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని పెదగంట్యాడ ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిపిఎం రెండో దఫా ప్రచారోద్యమానికి మంగళవారం శ్రీకారం చుట్టింది. గాజువాక, మల్కాపురం, స్టీల్‌జోన్ కమిటీల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఆటో జాతాలు నిర్వహించేందుకు పూనుకుంది. ఈ క్రమంలో ఆ జాతాలను మంగళవారం పాత గాజువాక జంక్షన్‌లో జెండా ఊపి జగ్గునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదాని గంగవరం పోర్టు కాలుష్యంతో ఇప్పటికే గాజువాక ప్రాంతమంతా కాలుష్యభరితంగా మారిందన్నారు. ఇప్పుడు అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే ఈ ప్రాంతం నివాసయోగ్యానికి పనికి రాకుండా పోతుందని, పది లక్షల మంది ప్రజల ఆరోగ్యాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, విశాఖ ఎంపి శ్రీభరత్ బాధ్యత తీసుకొని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముందు అదానికి వత్తాసు పలికి, ప్రజలు తిరుగుబాటు చూసి మాట మార్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలే సుప్రీం, ప్రజా నిర్ణయమే ఫైనల్ అని చెబుతున్న ఆయన సిమెంట్ ఫ్యాక్టరీ విషయంలో తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం గాజువాక, మల్కాపురం జోన్ కార్యదర్శులు ఎం.రాంబాబు, పి.పైడిరాజు, స్టీల్ జోన్ నాయకులు నమ్మి రమణ, ఎస్.రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలు సకాలంలో గణాంకాలు సమర్పించాలి

- పలు సంస్థల పనితీరుపై పియుసి కమిటీ అసంతృప్తి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వం నుండి నిధులు పొందుతున్న ప్రతి సంస్థ విధిగా గణాంకాలు, ఆడిట్ వివరాలు పక్కాగా నివేదికల సమర్పించకపోవడంపై రాష్ట్ర శాసన సభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. శాసనసభ కమిటీ సమావేశం గుంటూరు కలెక్టరేట్లో మంగళవారం జరిగింది. సమావేశానికి కమిటీ చైర్మన్, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్, రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్, ఎపి ఏవియేషన్ కార్పొరేషన్, ఎపి ఎయిర్‌పోర్ట్స్ అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలపై కమిటీ సమీక్షించింది. ఈ సమావేశంలో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. ప్రతి సంస్థ కార్యకలాపాలను క్షుణ్ణంగా ఆడిట్ విభాగం విచారణ చేయాలని సూచించారు. ఆడిట్ అభ్యంతరాలను సైతం సంస్థలు సమర్పించాలన్నారు. 182 సంస్థల కార్యకలాపాలను కమిటీ విచారణ చేయనుందని, ఇప్పటి వరకు 30 సంస్థలను పరిశీలించిందని తెలిపారు. ఎపి అటవీ అభివృద్ధి సంస్థ గత ఎనిమిదేళ్లుగా గణాంకాలు నిబంధనల మేరకు సమర్పించక పోవడంపై అధికారులను నిలదీశారు. రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ 2014 సంవత్సరం నుండి వార్షిక నివేదికలు సమర్పించక పోవడంపై ప్రశ్నించారు. ఎపి ఎయిర్ పోర్టుల అభివృద్ధి సంస్థ ఆరు సంవత్సరాలుగా ఆడిట్ చేయకపోవడాన్ని ప్రశ్నించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల నాటికి నివేదికలు తాజా పరచాలని ఆదేశించారు. ఎపి అటవీ అభివద్ధి సంస్థ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ వచ్చే మార్చి నెలాఖరుకి గణాంకాలు పూర్తి చేయాలని నిర్ణయం జరిగిందన్నారు. రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీషా మాట్లాడుతూ సంస్థ 293 పనులను రూ.14,820 కోట్లతో చేస్తుందని, ఇప్పటి వరకు రూ.3947 కోట్ల విలువైన పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎపి ఎయిర్‌పోర్టుల అభివృద్ధి సంస్థ ఎండి ప్రవీణ్ ఆదిత్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ రవికుమార్

రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్శిటీ స్థాపించాలి


- మంత్రి లోకేష్‌కు వి. శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ అంతర్జాతీయ క్రీడలకు పెరుగుతున్న ఆదరణ రీత్యా క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించేందుకు రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్శిటీని స్థాపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన లోకేష్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో క్రీడా కార్యకలాపాలు సమన్వయం చేసేందుకు ప్రత్యేకంగా క్రీడా విశ్వవిద్యాలయం స్థాపించాలని ఈ లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల ముంబయిలో జరిగిన క్రికెట్ వన్డే ప్రపంచకప్ పోరులో మన మహిళా టీం ఘన విజయం సాధించడంపట్ల యావత్ భారతదేశం హర్షం వ్యక్తం చేసిందని తెలిపారు. ఇటీవల కాలంలో మహిళలు క్రీడారంగంలో ముందంజలో దూసుకువస్తున్నప్పటికీ ప్రభుత్వాల నుండి తగిన ప్రోత్సాహం లేదని పేర్కొన్నారు. ఏదో ఒక క్రీడలో స్వశక్తిపై విజయం సాధించాక ప్రభుత్వాలు వారికి సన్మానాలు చేసి ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని తెలిపారు. తాజాగా క్రికెట్ టీమ్ సభ్యులు వివిధ మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలను పరిశీలిస్తే తల్లిదండ్రులు, బంధుమిత్రులు కోచ్‌లు ఇచ్చిన ప్రోత్సాహమే ప్రధానంగా ఉంది తప్ప ప్రభుత్వాల ప్రోత్సాహం ఉన్నట్లు ఎవరూ చెప్పలేకపోయారని తెలిపారు. బిసిసిఐ, ఐసిసి వంటి సంస్థలు ఉన్నప్పటికి క్షేత్రస్థాయి నుండి క్రీడాకారులను ప్రోత్సహించే విధానం లేదని తెలిపారు. క్రికెట్ పోటీలకు వివిధ కార్పొరేట్ సంస్థలు క్రీడాకారులను కొనుగోలు చేసేందుకు పోటీపడుతున్నాయని, ఒకరకంగా క్రీడలు ప్రత్యేకించి క్రికెట్ వ్యాపారంగా మారిపోయిందని పేర్కొన్నారు.

విజయం సాధించేందుకు ఇతరులను ఓడించేందుకు తప్పుడు పద్ధతులు అనుసరించడం, బెట్టింగులు ప్రవేశించడంతో క్రీడా స్ఫూర్తి దెబ్బతింటోందని తెలిపారు. క్రీడాకారులకు అన్యాయం జరుగుతోందని, ఈ బెట్టింగులకు మాఫియా కేంద్రంగా ఉందని వివరించారు. దీనికి యువత బలైపోతోందని, అంతర్జాతీయ పోటీల్లో క్రీడాకారులు రాణించలేకపోతున్నారని వివరించారు. విద్యార్థిదశ నుండే క్రీడా నైపుణ్యాన్ని తీర్చిదిద్దాలని ఇది వ్యాపారంగా కాకుండా జాతీయ ప్రతిష్టను పెంచేదిగా విధానం

ఉండాలని తెలిపారు. యువతరం ధృడమైన శక్తిగా మారాలంటే దీనికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. అందుకు విద్యావిధానంలో మార్పులు తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో మూడు క్రీడా పాఠశాలలు ఉన్నప్పటికీ అందులో విజయనగరం కేంద్రాన్ని మూసేశారని, మిగతా రెండు అంతంత మాత్రంగానే నడుస్తున్నాయని పేర్కొన్నారు. స్టేడియాల్లో తగినంత మంది కోచ్‌లు కూడా లేరని, శాప్ తరుపున కొంతమంది కోచ్‌లు అక్కడ ఉన్నప్పటికీ నిధులు లేక కార్యకలాపాలు పెద్దగా సాగడం లేదని వివరించారు. వాస్తవిక పరిస్థితిని పరిశీలించి క్రీడా శిక్షణ సమర్ధవంతంగా నడిచేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం ముందడుగుగా ఉంటుందని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించాలని మంత్రి లోకేష్‌ను శ్రీనివాసరావు కోరారు.



అనకాపల్లి పుస్తక మహోత్సవాన్ని సందర్శించి మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పుస్తక పఠనంతోనే లోకజ్ఞానం

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - అనకాపల్లి

పుస్తక పఠనంతోనే లోకజ్ఞానం సమకూరుతుందని శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆధునిక యుగంలో వేగవంతమైన జీవనశైలి కారణంగా ప్రజలు, ముఖ్యంగా యువత పుస్తక పఠనానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అనకాపల్లి పుస్తక మహోత్సవాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న బహుముఖ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను పుస్తకాలు చదవడంలో ప్రోత్సహించాలన్నారు. పూర్వం రోజుల్లో తల్లులు పిల్లలకు అన్నం తినిపించడానికి చందమామను చూపిస్తే, నేటి తరం తల్లులు సెల్ ఫోన్ చూపిస్తూ తినిపిస్తున్నారని వివరించారు. ఎంతో మంది మహనీయులకు పుట్టినిల్లు ఉత్తరాంధ్ర ప్రాంతం అని, గురజాడ అప్పారావు, ఆదిభట్ల నారాయణదాసు, కోడి రామ్మూర్తి తదితరులంతా ఇక్కడి వారేనని గుర్తుచేశారు. ప్రముఖుల సూక్తుల పుస్తకాలు, అబ్దుల్ కలాంవంటి మహనీయుల పుస్తకాలు అందుబాటులో ఉండడం ఆనందదాయకమని పేర్కొన్నారు. కేవలం హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకే పరిమితమైన ఈ పుస్తక ప్రదర్శనలను నేడు అనకాపల్లికి తీసుకువచ్చిన నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు, విద్యార్థులు, యువత ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలని, తద్వారా సమాజానికి, దేశానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, మల్ల సురేంద్ర, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మయ్య, త్రిమూర్తులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయం పనులు 91.7 శాతం పూర్తి

- ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి-భోగాపురం (విజయనగరం)

విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డు ఎయిర్‌పోర్టు పనులు 91.7 శాతం పూర్తయ్యాయని కేంద్ర విమానాయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఎయిర్‌పోర్టు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఎన్ని సమస్యలు ఎదురైనా ఎయిర్‌పోర్టును పూర్తి చేసేందుకు కృత నిశ్చయంతో పని చేస్తున్నామని చెప్పారు. ప్రపంచస్థాయి స్టాండర్స్‌తో ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నామన్నారు. డిసెంబర్‌లోగానీ జనవరిలోగానీ టెస్ట్ ఫ్లయిట్ ఎగరనుందని తెలిపారు. ఎయిర్‌పోర్టు ప్రాంతంలో 5 స్టార్ హోటల్స్ వస్తున్నాయని, ఉపాధి అవకాశాలు సృష్టించడమే తమ లక్ష్యమని అన్నారు. లోకల్ టాలెంట్‌కు తగ్గ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని తెలిపారు. ఏవియేషన్ యూనివర్సిటీ తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దేశంలో గత 18 నెలల్లో అనేక ఎయిర్‌పోర్టులు ప్రారంభించామని, ఎయిర్‌పోర్టు రాగానే ఎకానమీ బాగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ నెలలో విశాఖలో జరగబోయే పారిశ్రామిక సదస్సులో ఏవియేషన్‌కి సంబంధించిన కంపెనీలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. భోగాపురం ప్రాంతంలో స్కిల్ యూనివర్సిటీలు నిర్మిస్తామన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీ ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మంత్రి వెంట కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక ఎమ్మెల్యే లోకం మాధవి తదితరులు ఉన్నారు.

టిడిపి కార్యాలయంలో 'తిరువూరు' పంచాయతీ

- విడివిడిగా క్రమశిక్షణా కమిటీ ముందు హాజరైన ఎంపి,ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపి కేశినేని చిన్నిలు మంగళగిరి పార్టీ కార్యాయలంలో మంగళవారం క్రమశిక్షణా కమిటీ ముందు హాజరయ్యారు. వీరు పరస్పరం ఆరోపణలు చేసుకున్న నేపథ్యంలో మంగళవారం క్రమశిక్షణా కమిటీ ముందు హాజరుకావాలని పార్టీ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఉదయం క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి తన వాదనను నివేదిక రూపంలో కమిటీకి అందజేశారు. విజయవాడ ఎంపి కేశినేని చిన్ని సాయంత్రం క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి 20 నిమిషాల పాటు తను చేసిన ఆరోపణలపై వివరణ ఇవ్వడంతో పాటు తనకు తిరువూరులో జరిగిన అవమానం కంటే ఎమ్మెల్యే వల్ల పార్టీకి ఎక్కువ నష్టంజరిగిందని వివరించినట్లు తెలిసింది. నియోజకవర్గ కార్యకర్తల అభీష్టం మేరకు పార్టీ అధిష్టానం నిర్ణయం ఉంటుందని అనుకుంటున్నట్లు ఆయన మీడియాకు వెల్లడించారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, సభ్యులు కొనకళ్లనారాయణ, వర్ల రామయ్య, ఎంఎ షరీఫ్, పంచుమర్తి అనురాధ ఇద్దరు నేతలనుంచి వివరణ కోరారు.



బోల్తాపడిన బస్సు

ఐచర్..బస్సు ఢీ

- ఒకరు మృతి

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని దామాజిపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై ఐచర్ వాహనాన్ని జబ్బర్ ట్రావెల్స్ ప్రైవేట్ బస్సు ఢీకొని బోల్తా పడింది. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న జబ్బర్ ట్రావెల్స్ బస్సు మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో చెన్నేకొత్తపల్లి మండలంలోని దామాజిపల్లి సమీపంలో ఐచర్ వాహనాన్ని వెనుక నుంచి బస్సు ఢీకొట్టి అదుపు తప్పింది. కొద్దిదూరం వెళ్లిన తర్వాత బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సురక్ష (30) అనే మహిళ మృతి చెందారు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను చెన్నేకొత్తపల్లి హాస్పిటల్‌కు, మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనకాపల్లిలో ఎన్‌సిఎల్ కొత్త సిమెంట్ గ్రైండింగ్ ప్లాంట్ ఏర్పాటు

విశాఖపట్నం : ప్రముఖ సిమెంట్ తయారీదారులలో ఒకటైన ఎన్‌సిఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి సమీపంలోని తాళ్లపాలెంలో తమ నూతన, అత్యాధునిక సిమెంట్ గ్రైండింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ప్లాంట్‌ను భారత ప్రభుత్వ భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ లాంఛనంగా ప్రారంభించారని వెల్లడించింది. ఈ కార్యక్రమంలో కంపెనీ ఉన్నత యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్ ద్వారా కంపెనీ ఉత్పత్తి సామర్థ్యానికి అదనంగా 6,60,000 టన్నులు చేరనుందని.. దీంతో సంస్థ మొత్తం సిమెంట్ సామర్థ్యం సంవత్సరానికి 40 లక్షల టన్నులకు చేరుకుంటుందని ఎన్‌సిఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్ కె రవి తెలిపారు.

నాణ్యతలేని రా మెటీరియల్!

- 18,230 టన్నులకు సమానమైన 4,779 ఇనుప దూలాలు తిరస్కరణ
- పథకం ప్రకారం 'ఉక్కు'ను నష్టపరుస్తున్న కేంద్రం
- జనవరి నుంచి ఇఒఐకి పలు డిపార్టుమెంట్లు



ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకారం నష్టపరుస్తూ మూసివేత దిశగా తీసుకెళ్తోంది. అయినప్పటికీ రాష్ట్రంలోని టిడిపి కూటమి నేతలు 'ఇదిగో ఆర్థిక ప్యాకేజీ తెచ్చేశాం.. అదిగో ఉక్కు సామర్థ్యాన్ని పెంచేశాం' అంటూ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌లో వాస్తవికతను తెలుసుకునేందుకు సైతం ప్రభుత్వం సుముఖంగా లేదు. ప్రస్తుతం ప్లాంట్‌లోని ఉన్నతాధికారులు (యాజమాన్యం) నాణ్యత లేని రా మెటీరియల్ ఐరన్ ఓర్, కోక్, లైమ్ స్టోన్‌ను కొనడం, వాటినే ఉత్పత్తిలో వాడడం వల్ల ప్లాంట్‌లో 18230 టన్నులకు సమానమైన 4,779 ఇనుప దూలాలు (బ్లూమ్స్) బహిరంగ మార్కెట్లో తిరస్కరణకు గురయ్యాయి. ఒక్కో బ్లూమ్ 3.87 టన్నులు ఉంటుంది. రా మెటీరియల్ కొనుగోలులో యాజమాన్యం సక్రమంగా వ్యవహరించడం లేదన్న అంశాన్ని గడిచిన నాలుగు నెలలుగా కిందిస్థాయి అధికారులు, కార్మికులు పదేపదే ఉన్నతాధికారులకు చెబుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదు.

టోటల్ మెయింటినెన్స్ కాంట్రాక్టు (టిఎంసి) పేరుతో రా మెటీరియల్ హేండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పి), సింటర్ ప్లాంట్, కోకో-1, బ్లాస్ట్ ఫర్నేస్‌ల విభాగాల్లో గడిచిన నాలుగు నెలలుగా సామర్థ్యం పడిపోయే రీతిలో కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం కలిసి చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలోనే హెచ్‌ఒడిలను ఒకచోట నుంచి మరో చోటకు మార్చుతున్నారు. ఆర్ఎంహెచ్‌పిలో పదుల సంఖ్యలో నైపుణ్యంగల వర్కర్లకు విఆర్ఎస్ ఇచ్చేసి బయటకు పంపేశారు. టిఎంసిల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కన్వేయర్లు, టిప్పర్‌లు, యార్డు స్టాక్ పాయింట్ నుంచి తెచ్చే స్టాకర్, ఐరన్ ఓర్ కోల్‌ను డిపార్టుమెంట్లకు తరలించే రిక్లెయిమర్‌లన్నింటికి నష్టం వచ్చినట్లు కార్మికులు చెబుతున్నారు. ప్లాంట్‌లో 29 డిపార్టుమెంట్లు ఉండగా వేర్వేరు చోట్ల 36 ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఇఒఐ)లను ఇప్పటి వరకూ పిలిచారు. ఇప్పుడు ఉత్పత్తి ఫెయిల్ (డామేజ్) జరిగిన విభాగాల్లో కూడా 2026 జనవరి నుంచి ఇఒఐలను పిలిచేందుకు కేంద్రం ఆదేశాలతో యాజమాన్యం రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

తగ్గుతున్న ఉత్పత్తి

ఆర్ఎంహెచ్‌పిని పూర్తి స్థాయిలో నడపలేకపోవడంతో బ్లాస్ట్ ఫర్నేస్ ఉత్పత్తి తగ్గించాల్సి వచ్చింది. సింటర్ ప్లాంట్, కోకో-1లోనూ ప్రస్తుతం ఉత్పత్తిని తగ్గించేశారు. మరికొద్ది రోజుల్లో ప్లాంట్ మొత్తంగా ఉత్పత్తి తగ్గించే పరిస్థితి ఏర్పడనుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రా మెటీరియల్స్ అన్నీ ప్లాంట్‌లోనే తయారు చేసేవారు. ప్రస్తుతం కోక్ బయట నుంచి కొనుగోలు చేస్తున్నందున అందులో సల్ఫర్ కంటెంట్ అధికంగా ఉంటోంది. దీంతో, బ్లాస్ట్ ఫర్నేస్‌లలో ఉత్పత్తి నాణ్యతగా రాకపోవడంతో ఎస్ఎంఎస్ -1లో కన్వర్టర్-2 పూర్తిగా షట్‌డౌన్ అయిపోయింది. రా మెటీరియల్ నాణ్యతగా లేనందున కన్వర్టర్-3 రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదానికి గురైంది. ఉత్పత్తి తగ్గి రిజెక్ట్ అయిన బ్లూమ్స్ 18,230 టన్నులు ప్లాంట్ బ్లూమ్ యార్డులో వృథాగా ఉన్నాయి. ఆర్ఎంహెచ్‌పి, సింటర్ ప్లాంట్ రెండింటినీ టిఎంసికి ఇచ్చారు. ఆ రెండు విభాగాలు రా మెటీరియల్‌ను సక్రమంగా ఇవ్వలేకపోవడంతో ఉత్పత్తి దెబ్బతింటోంది.



వ్యూ పాయింట్ వద్ద విరిగిపడిన కొండచరియలు

సుండిపెంటలో కుండపోత వర్షం

- శ్రీశైలం -హైదరాబాద్ రహదారిపై విరిగిపడిన కొండచరియలు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం సుండిపెంటలో మంగళవారం ఉదయం గంటపాటు కుండపోత వర్షం కురిసింది. శ్రీశైలం డ్యాం నుండి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై వ్యూ పాయింటు దగ్గర కొండచరియలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినది. శ్రీశైలం రోప్ వే సమీపంలోని పాతాళ గంగ మెట్టు మార్గంలో కొండచరియలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో యాత్రికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని దేవస్థానం అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో శ్రీశైలం-హైదరాబాదు ఘాట్ రోడ్‌లో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణం చేయాలని పోలీసులు సూచించారు.

గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ పరిశ్రమలకు అండగా ప్రభుత్వం

- సీనరేజ్ చెల్లింపుల విషయంలో సానుకూల నిర్ణయం
- మంత్రి కొల్లు రవీంద్ర హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ పరిశ్రమలకు అండగా నిలవడంతోపాటు సీనరేజ్ చెల్లింపుల విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బిఎన్ విజయ్‌కుమార్‌తో పాటు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్ల అసోసియేషన్ ప్రతినిధులు సచివాలయంలో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రులకు వివరించారు. అన్ని గ్రేడ్‌ల ముడి సరుకుకు కూడా ఒకే విధంగా సీనరేజ్ చెల్లించడం ఆర్థిక ఇబ్బందిగా ఉందని, ఆ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి, కటింగ్ యూనిట్స్ నిర్వాహకులకు ఎలాంటి నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. సమ్మె కారణంగా ఫ్యాక్టరీలపై ఆధారపడిన కార్మికులు అవస్థలు పడతారని, తక్షణమే సమ్మె విరమించి పనులు ప్రారంభించాలని, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్ యజమానులకు సూచించారు. ఫ్యాక్టరీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం లక్ష్యంగా మైనింగ్ జెడి, జిల్లా డిఎంజిఒ, సీనరేజి వసూలు సంస్థ ప్రతినిధితో పాటు ప్రతి అసోసియేషన్ నుంచి ఇద్దరు సభ్యులతో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులతో చర్చించి వారం రోజుల్లో నివేదిక అందించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు.

పిపిపి మోడ్‌లో 8 నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అప్పుడే పుట్టిన బిడ్డల కోసం అదనంగా మరో 8 నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాలను పిపిపి మోడ్‌లో నెలకొల్పనున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా కేంద్రాల ద్వారా అదనంగా 80 పడకలు (వార్మర్స్) అందుబాటులోకి రానున్నాయన్నారు. ఒక్కో స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్స్ (ఎస్ఎన్‌సియు) ఏర్పాటుకు రూ.60 లక్షలు అవసరం కాగా, 8 యూనిట్స్‌కు రూ.4.80 కోట్లు ఖర్చవుతుందన్నారు. అలాగే ఒక్కో యూనిట్‌కు నెలకు రూ.8.91లక్షల చొప్పున 8 యూనిట్ల నిర్వహణకు రూ.1.07 కోట్లు అవసరమవుతుందన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏరియా ఆస్పత్రి, చిత్తూరు జిల్లాలోని కుప్పం ఏరియా ఆస్పత్రి, అనంతపురం జిల్లా గుంతకల్లు ఏరియా ఆస్పత్రి, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సిహెచ్‌సిలలో ఈ నెలాఖరులోగా అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు ఏరియా ఆస్పత్రి, నెల్లూరు జిల్లా కావలి ఏరియా ఆస్పత్రి, శ్రీసత్యసాయి జిల్లా కదిరి ఏరియా ఆస్పత్రి, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రుల్లో యూనిట్లు నవంబరులో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సత్తెనపల్లిలోని న్యూబార్న్ స్టెబిలైజేషన్ యూనిట్‌ను ఎస్ఎన్‌సియుగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. యూనిట్లలో తక్కువ బరువుతో పుట్టిన శిశువులు (నియోనేటెల్ జాండిస్) వచ్చిన శిశువులు, హైపో థెర్మియా, ఎఆర్‌డిఎస్ (శ్వాసకోశ సంబంధిత సమస్యలు) సెప్సిస్ వంటి సమస్యలు ఉన్న నవజాత శిశువులకు ఇక్కడ చికిత్స అందిస్తారని ఆయన పేర్కొన్నారు.

స్వల్పంగా కంపించిన భూమి

- ఉలిక్కిపడ్డ విశాఖ, అల్లూరి, విజయనగరం వాసులు
- విశాఖకు 400 కిలోమీటర్ల పరిధిలో ప్రకంపనలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్రలోని విశాఖ, అల్లూరి, విజయనగరంలో మంగళవారం తెల్లవారుజామున 4.18 నుంచి 4.20 మధ్య స్వల్పంగా భూమి కంపించింది. విశాఖ నగరంలోని బీచ్‌రోడ్డు సహా పలు ప్రాంతాల్లో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. సాగర్‌నగర్, ఆర్‌కె బీచ్‌రోడ్డు, అక్కయ్యపాలెం, సీతమ్మధార, మురళీనగర్, రుషికొండ, కైలాసపురం, గాజువాక, గోపాలపట్నం ఇలా పలుచోట్ల భూమి కంపించింది. విశాఖకు 400 కిలోమీటర్ల పరిధిలో ఈ ప్రకంపనలు సంభవించినట్లు సెస్మోగ్రఫీ సంస్థ వెల్లడించింది. విశాఖలో సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.7 మాగ్నిట్యూడ్ ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ ధ్రువీకరించింది. విశాఖపట్నానికి సుమారు 120 కిలోమీటర్ల దూరానగల అల్లూరి జిల్లా జి.మాడుగుల వద్ద 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్టు 'వల్కనోడిస్కవరీ' అనే సంస్థ వెల్లడించింది. ఈ మండలంలోని జంగాలమెట్ట గ్రామంలో 4:19 గంటల సమయంలో భూమి కంపించింది. గిరిజన మహిళ గుంట పూర్ణమ్మ గృహం కూలిపోయింది. ఎటువంటి ప్రాణ నష్టమూ జరగకపోవడంతో గ్రామస్తులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భూకంప తీవ్రత భూ ఉపరితలంపై కంటే అడుగు భాగంలోనే ఎక్కువగా ఉండడం శాస్త్రవేత్తలను సైతం ఆందోళనకు గురిచేసింది. భూకంపాల ప్రమాద జోన్‌గా విశాఖపట్నం ఎప్పటినుంచో ఉందని వాతావరణ అధ్యయన సంస్థలు ఇదివరకే వెల్లడించిన విషయాన్ని పలువురు గుర్తుచేసుకున్నారు.

విజయనగరం పట్టణం, మండల పరిధిలో కొన్ని సెకండ్ల పాటు కంపించింది. కాలకృత్యాలకు వెళ్లిన వారు, టీ తాగేందుకు లేచిన వారు స్వల్పంగా భూమి కంపించినట్లు గుర్తించారు. విజయనగరంలోని ఆర్అండ్‌బి జంక్షన్, కెఎల్ పురం, విటి అగ్రహారం, విజయనగరం మండల పరిధిలో ముడిదాం, అంబటి వలస, చెల్లూరు తదితర గ్రామాల్లో భూమి కనిపించినట్లు ప్రజలు పేర్కొన్నారు.

విద్యుత్ సంస్థను కాపాడుకుందాం

- ప్రైవేటీకరణను అడ్డుకుందాం
- సదస్సులో ఇఇ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు జయశంకర్



సదస్సులో మాట్లాడుతున్న జయశంకర్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణను అడ్డుకొని, సంస్థను కాపాడుకుందామని ఇఇ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జయశంకర్ పిలుపునిచ్చారు. 'విద్యుత్తురంగ ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి' అనే నినాదంతో ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు) రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు అధ్యక్షత వహించారు. జయశంకర్ మాట్లాడుతూ... ఇటీవల కాలంలో ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని, అమెరికా వంటి సంపన్న దేశం కూడా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందని, అలాంటి సమయంలో కూడా మన దేశం ఆర్థికంగా బలంగా నిలబడడానికి ప్రధాన కారణం బ్యాంకింగ్ వ్యవస్థ మొత్తం ప్రభుత్వ ఆధీనంలో ఉండడమేనని అన్నారు. ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం దారులు తెరవడంతో దోపిడీదారులు ప్రవేశించి ప్రభుత్వ సంస్థలను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణలో భాగంగా దశలవారీగా స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని, సబ్ సెంటర్ల ఏర్పాటు, లైన్ల ఆధునీకరణ వంటి పనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వలన భవిష్యత్తులో విద్యుత్ వ్యవస్థ మొత్తం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోయే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తులో డిఎ, అరియర్స్, బోనస్ అనేవి ఉండవని వివరించారు. అదాని, అంబానిలను ప్రపంచ కుబేరులుగా చేయాలని లక్ష్యంతోనే ప్రధాని మోడీ పనిచేస్తున్నారని విమర్శించారు. సంఘటిత, అసంఘటిత కార్మికులందరూ ఐక్యమై, మహిళలు, రిటైర్డ్ ఉద్యోగులను కలుపుకొని, ప్రజల్లో చైతన్యం తీసుకొస్తూ భారీ స్థాయిలో ఐక్య ఉద్యమాలు చేపట్టాలని, అందుకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ... రాష్ట్రంలోని విద్యుత్ రంగ సంస్థలు రూ.1.2 లక్ష కోట్ల అప్పుల్లో కూరుకుపోయాయని, ఇందుకు పాలకుల తీరే కారణమని విమర్శించారు. దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేకునేందుకు మరో స్వాతంత్ర్య ఉద్యమం అవసరమని, రాజీలేని పోరాటాలకు కార్మికులందరూ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో పాల్గొన్న సంఘాల నాయకులందరూ ఐక్యంగా ఈనెల 20న విజయవాడ కేంద్రంగా జరిగే భారీ పోరాటం, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, స్ట్రగుల్ కమిటీ కార్యదర్శి సుబ్బిరెడ్డి, ట్రబుల్స్ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన గుడ్డు ధర

- రిటైల్‌లో రూ.7
- రైతుకు దక్కుతున్నది రూ.5.80 మాత్రమే
- తగ్గిన ఉత్పత్తితో పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కార్తీక మాసంలోనూ గుడ్డు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ మాసంలో అత్యధిక మంది శాకాహారమే తీసుకుంటారు. అయినా, కోడిగుడ్డుకు రిటైల్ మార్కెట్లో రూ.7 ధర పలుకుతోంది. అయితే, రైతులకు మాత్రం రూ.5.80 మాత్రమే దక్కుతోతంది. గత ఏడాది కంటే 30 పైసలు పెరిగినా గిట్టుబాటు కావడం లేదని రైతులు చెప్తున్నారు. కోళ్ల మేత ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని అంటున్నారు. చలి తీవ్రత పెరిగే కొద్దీ గుడ్డు ధర పెరిగే అవకాశం ఉందని పౌల్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటి వరకు వివిధ రకాల వైరస్‌లతో సతమతమైన కోళ్ల పరిశ్రమకు సంక్రాంతి వరకు మంచి రోజులు ఉంటాయని కోళ్ల రైతులు ఆశిస్తున్నారు. స్థానికంగా వినియోగం తగ్గినా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండడంతో డిమాండ్ నెలకొంది. ఉత్తరాది రాష్ట్రంలో చలి కాలంలో కోడిగుడ్డు అధికంగా తింటారు. దీంతో, ఇక్కడి నుంచి 70 శాతం గుడ్డు ఎగుమతులు జరుగుతున్నాయి. పెరవలి మండలం నుంచే రోజుకు 100 నుంచి 150 లారీల గుడ్లు ఎగుమతి అవుతున్నాయి. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో పౌల్ట్రీ పరిశ్రమ నష్టాల్లో ఉండడంతో రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు. దీంతో, ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయం తర్వాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉండగా, గతంలో 1.10 కోట్ల గుడ్డు ఉత్పత్తి జరిగేది. ప్రస్తుతం కొన్ని ఫారాలు మూతపడడంతో ఉత్పత్తి 70 లక్షలకు పరిమితమైంది. స్థానిక మార్కెట్లో 30 శాతం వినియోగిస్తుండగా, 70 శాతం గుడ్లు ఒడిశా, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.

రైతుకు అంతంత మాత్రమే...

కోళ్లకు వినియోగించే మేత, దాణా ఖర్చులు ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగాయి. మొక్కజొన్న, సోయా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18 వేల నుంచి రూ.25 వేలు, సోయా రూ.50 వేల నుంచి రూ.80 వేలకు పెరిగింది. గుడ్డు ధర కనీసం రూ.6 లభిస్తే నష్టాల నుంచి కొంతమేర కోలుకోగలమని రైతులు చెబుతున్నారు. గుడ్లు పెట్టే కోళ్లను ఆరు నెలల పెంపకం అనంతరం మరో ఆరు నెలలు గుడ్ల ఉత్పత్తి జరుగుతుంది. ఏడాది అనంతరం కొత్త బ్యాచ్‌లు వేయడం పరిపాటి. ఈ ఏడాది జనవరిలో కొత్త బ్యాచ్‌లు వేయకపోవడం, గత ఏడాది వేసిన బ్యాచ్‌లను మేలో కోతకు తరలించడంతో గుడ్లు పెట్టే కోళ్ల కొరత నెలకొంది.

రూ.6 వస్తేనే ఉపశమనం

ఈ ఏడాది అత్యధిక కాలం రైతులకు గుడ్డు ఒక్కంటికీ రూ.4.50 ధర మించలేదు. ఇప్పుడు ధర కొంత పెరిగింది. మేత ధరలు, విద్యుత్ బిల్లుల పెట్టుబడి ఖర్చు కారణంగా ఉత్పత్తి ఖర్చు పెరుగుతూ వస్తోంది. గుడ్డు ఒక్కంటికీ రూ.6 ధర లభిస్తేనే రైతుకు నష్టాల నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది.

- సిహెచ్.చలపతిరావు పౌల్ట్రీ రైతు, పెరవలి, తూర్పుగోదావరి జిల్లా

మాకు ఎయిర్‌పోర్టు వద్దు

- ఒక్క అంగుళం భూమి కూడా ఇవ్వం
- ఆర్‌డిఒకు స్పష్టం చేసిన రైతులు



సమావేశం నుంచి వెనుదిరుగుతున్న అధికారులు

ప్రజాశక్తి - మందస

తమకు ఎయిర్‌పోర్టు వద్దని, జీవనాధారమైన భూములే కావాలని శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల రైతులు అధికారులకు తేల్చి చెప్పారు. కార్గో ఎయిర్‌పోర్టు భూ సర్వేపై బాధిత రైతులతో మండలంలోని బిడిమి, రాంపురం, లక్ష్మీపురం, భేతాళపురంలో పలాస ఆర్‌డిఒ జి వెంకటేష్, తహశీల్దార్ శ్రీకాంత్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతనే సర్వేకు వెళ్తామని చెప్పారు. రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అధికారులు మాట్లాడుతున్న సమయంలోనే కొందరు టిడిపి నాయకులు కలుగజేసుకుని రైతులకు ప్రభుత్వం మెరుగైన పరిహారం ఇస్తుందని, అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. టిడిపి నాయకులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్గో ఎయిర్‌పోర్ట్‌కి ఒక్క అంగుళం భూమి కూడా ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. మాకు ఎయిర్‌పోర్టు వద్దని పదేపదే చెప్తుంటే, ఎందుకు గ్రామాలకు వస్తున్నారని అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. రీ సర్వే చేయాలంటే రైతుల భూములను తప్పించి వేరే చోట చేసుకోవాలని సూచించారు. అధికారులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా, స్థానికులు వినిపించుకోకపోవడంతో అక్కడ్నుంచి వెనుదిరిగారు.

సమావేశానికి వెళ్లనీయకుండా గృహనిర్బంధం

బిడిమిలో నిర్వహించిన సమావేశానికి వెళ్లనీయకుండా మందస కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు పేరుతో ప్రజల భూములను తీసుకోవడం అన్యాయమన్నారు. బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న పోరాట కమిటీ నాయకులను గృహ నిర్బంధం చేయడంపై సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, లిబరేషన్ నాయకులు ఎం.రామారావు తీవ్రంగా ఖండించారు.

ఎస్‌బిఐ వ్యాపారం @ 100 లక్షల కోట్లు

- క్యూ2లో రూ.20,160 కోట్ల లాభాలు

తగ్గిన ఎన్‌పిఎలు



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మొత్తం వ్యాపారం రూ.100 లక్షల కోట్లకు చేరి.. నూతన మైలురాయిని సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో రూ.20,160 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. యెస్ బ్యాంక్‌లో వాటాల విక్రయం, నిరర్థక ఆస్తులు తగ్గడం ఎస్‌బిఐ మెరుగైన ఆర్థిక ఫలితాలకు ప్రధాన కారణం. ఇటీవల యెస్ బ్యాంక్‌లోని తన 13.18 శాతం వాటాను విక్రయించడం ద్వారా రూ.4,593 కోట్ల లాభాలను నమోదు చేసింది. ఇది నికర లాభాల పెరుగుదలకు ప్రధాన మద్దతును అందించింది. కాగా.. 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.18,331 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. దీంతో పోల్చితే గడిచిన క్యూ2లో 10 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఇదే సమయంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 3.3 శాతం పెరిగి రూ.42,984 కోట్లుగా నమోదయ్యింది. గతేడాది ఇదే క్యూ2లో రూ.41,620 కోట్ల ఎన్ఐఐని ఆర్జించింది.

2025 సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 40 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 1.73 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పిఎలు 0.42 శాతానికి పరిమితమయ్యాయి. గడిచిన క్యూ2 త్రైమాసికంలో 64 శాతం సేవింగ్ బ్యాంక్ ఖాతాలు కూడా యోనో ద్వారా తెరువబడ్డాయని ఎస్‌బిఐ వెల్లడించింది. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో ఎస్‌బిఐ రుణాల జారీ 12.7 శాతం పెరిగి రూ.55.9 లక్షల కోట్లకు చేరింది. గతేడాది ఇదే సమయానికి రూ.44.2 లక్షల కోట్ల రుణ పుస్తకం నమోదయ్యింది. 2025 సెప్టెంబర్ ముగింపు నాటికి ఎస్‌బిఐ రుణాలు, డిపాజిట్లు తదితర మొత్తం వ్యాపారం రూ.100 లక్షల కోట్లకు చేరింది. మంగళవారం భారత స్టాక్ మార్కెట్లు ప్రతికూలతను ఎదుర్కొన్నప్పటికీ.. బిఎస్ఇలో ఎస్‌బిఐ షేర్ 0.72 శాతం పెరిగి రూ.957.05 వద్ద ముగిసింది.

బజాజ్ ఫైనాన్స్ రుణాల్లో 27 శాతం వృద్ధి

హైదరాబాద్ : దేశంలోః అతిపెద్ద బ్యాంకింగేతర విత్త సంస్థ బజాజ్ ఫిన్‌సర్వ్‌లో భాగమైన బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఇటీవల పండుగ సీజన్‌లో భారీగా రుణాలను జారీ చేసినట్లు తెలిపింది. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే పరిమాణంలో 27 శాతం, విలువలో 29 శాతం ఎక్కువ రుణాలు అందించినట్లు వెల్లడించింది. జిఎస్‌టి శ్లాబుల్లో తగ్గుదల కూడా ఇందుకు కలిసి వచ్చిందని తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 26 మధ్య సుమారు 63 లక్షల రుణాలను పంపిణీ చేసింది. ఈ కాలంలో 23 లక్షల కొత్త కస్టమర్లను సంపాదించుకున్నట్లు తెలిపింది. అందులో 52 శాతం మంది రుణాలు పొందారని బజాజ్ ఫైనాన్స్ ఛైర్మన్ సంజీవ్ బజాజ్ వెల్లడించారు. లక్షలాది తక్కువ ఆదాయ కుటుంబాలను పండుగ సీజన్‌లో నమ్మకంగా ఖర్చు చేయడానికి సాధికారత కల్పించామన్నారు.

సంపాదకీయం

స్వర్ణ దీప్తులు

ఐదు దశాబ్దాల కలను భారత మహిళలు సాకారం చేశారు. ఆకాశమే హద్దుగా అద్భుత ప్రదర్శనతో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని అమ్మాయిల జట్టు ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచింది. అడ్డంకులన్నీ అధిగమించి, బలమైన దక్షిణాఫ్రికా జట్టును 52 పరుగులతో ఓడించడం ద్వారా భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించింది.

1973లో మనదేశంలో మహిళా క్రికెట్ సంఘం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయ పోటీల్లో భారత మహిళల ప్రస్థానం మొదలైంది. తొలితరం క్రికెటర్లు సొంత బ్యాటు, కిట్టు లేకపోయినా, జనరల్ బోగీల్లో ప్రయాణిస్తూ... సొంత డబ్బులపైనో, చందాలపైనో ఆధారపడి దేశం తరపున ఆడారు. ఆ తరువాత స్పాన్సర్లు ముందుకు రావడం, 2005లో బిసిసిఐ పరిధిలోకి రావడం జరిగాయి. 2022లో పురుషుల, మహిళల జట్ల మధ్య వేతన సమానత్వాన్ని, మహిళల ప్రీమియర్ లీగ్‌ను ప్రవేశపెట్టడం, అంతర్జాతీయ క్రికెటర్లతో ఆడే అవకాశం లభించడం, ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి రావడం... ఇవన్నీ మహిళల క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లాయి. వరుసగా రెండుసార్లు అండర్ - 19 అమ్మాయిల జట్టు ప్రపంచకప్ నెగ్గడం, తాజాగా సీనియర్ జట్టు సాధించడం మహిళా క్రికెట్‌లో ఉజ్వల భవితకు పునాది.

ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాలతో డీలాపడిన జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో అమోల్ మజుందార్ కోచ్‌గా, మెంటార్‌గా అందించిన ప్రోత్సాహం ఆటగాళ్లలో మానసిక దృఢత్వాన్ని తీసుకొచ్చింది. డిఫెండింగ్ ఛాంపియన్, అప్పటికే ఓసారి ఓడించిన ఆస్ట్రేలియా సెమీఫైనల్స్‌లో 338 రన్స్ చేయడంతో భారత్ ఓడిపోతుందని క్రీడా పండితులు అంచనా వేశారు. ప్రత్యర్థులంతా చుట్టుముడుతున్నా... సహచరులు ఒక్కొక్కరు అవుటవుతున్నా... అవరోధాలకు ఎదురొడ్డి ఆస్ట్రేలియాపై అజేయంగా 127 పరుగులుచేసి భారత్‌ను విజేతగా నిలపడంలో కీలక పాత్ర జెమీమా రోడ్రిగ్స్‌దే. 'ఐ వుడ్ లైక్ టు థాంక్ జీసస్' అన్న ఆమె మాటలను మతోన్మాదులు విపరీతంగా ట్రోల్ చేయడం సిగ్గుచేటు. నైపుణ్యం, ఆటతీరే ఆటగాళ్ల ఎంపికకు ఆధారం కానీ, మతం కాదన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించిన ఇటువంటి భావజాలాన్ని తుదముట్టించాల్సిందే! మరొకరి మతంపై, విశ్వాసాలపై దాడి చేయడం అనాగరికం.

కడపజిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల నల్లపురెడ్డి శ్రీచరణి లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా 9 మ్యాచ్‌లు ఆడి, 14 వికెట్లు తీయడం ద్వారా ప్రపంచకప్‌లో నాలుగో స్థానంలో నిలవడం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లుసైతం ఆమె బౌలింగ్‌ను ఎదుర్కోవడానికి ఆపసోపాలు పడటం ఆమె నైపుణ్యానికి నిదర్శనం. 22 వికెట్లతో మన దేశానికే చెందిన దీప్తిశర్మ మొదటిస్థానాన్ని దక్కించుకుని, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను సొంతం చేసుకుంది. అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా వైస్ కెప్టెన్ స్మృతి మందాన నిలిచింది. గ్రూప్ దశలో బ్యాటింగ్‌లో స్మృతీ మంధాన, ప్రతీకా రావల్, అమన్‌జోత్, రిచా ఘోష్, బౌలింగ్‌లో దీప్తి శర్మ, క్రాంతిగౌడ్, రేణుకాసింగ్ సత్తా చాటారు. ఫైనల్స్‌లో షఫాలీ వర్మ సూపర్ ఇన్నింగ్స్, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో, హర్మన్ ప్రీత్‌కౌర్ కెప్టెన్సీ... ఇలా అందరి సమిష్టి కృషే జగజ్జేతగా నిలిపింది.

జట్టులోని చాలామంది దిగువ మధ్యతరగతివారే. శ్రీచరణి తండ్రి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో చిన్న ఉద్యోగి. గ్రామీణ నేపథ్యం నుంచి కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ ఎదిగారు. మూడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్న రేణుక, పోలీస్ కానిస్టేబుల్ కుమార్తె క్రాంతిగౌడ్, తన తండ్రి చెక్కిన బ్యాట్‌తో కెరీర్ మొదలు పెట్టిన అమన్‌జోత్ లాంటి వారంతా అనేక కష్టాలను ఎదురొడ్డి నిలిచిన వారే. ఇన్ని కష్టాల మధ్య కుటుంబ సభ్యులు, కోచ్‌లు లేదా ఇంకెవరైనా ప్రోత్సాహంతో రాణిస్తున్నారే తప్ప ప్రభుత్వ తోడ్పాటు, ప్రోత్సాహం కరువవుతున్నాయి. క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, క్రీడాకారులు రాణించడానికి కావలసిన ప్రోత్సాహం ప్రభుత్వాల నుంచి రావాలి. వారిని రంగం మీద నిలిపి గెలుపు సాధించేలా చూడాలి. హర్మన్ ప్రీత్ కౌర్ నేతృత్వంలో జగజ్జేతగా నిలిచిన టీమిండియా...ఆకాశంలో సగం...అన్నింటా సగం... అన్న స్ఫూర్తితో అమ్మాయిలు క్రికెట్ సహా అన్ని రంగాల్లో స్వర్ణ దీప్తులు నింపేందుకు స్ఫూర్తినిస్తుంది.

మహనీయుల మాట




ఏం జరుగుతున్నదో బిగ్గరగా చెప్పడమే ఎవరైనా ఎప్పుడైనా చేయగల అత్యంత విప్లవాత్మకమైన పని.

- రోజా లగ్జంబర్గ్,
మార్క్సిస్టు సిద్ధాంతకర్త.



విశ్లేషణ

రాష్ట్రంలో పరిశ్రమలు-అభివృద్ధి స్వభావం



> **రాష్ట్రంలో ప్రైవేట్ పరిశ్రమలు విధ్వంసకర అభివృద్ధిని సృష్టిస్తున్నాయి. అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ దోపిడీ చేస్తున్నాయి. వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నా కార్మికులు మాత్రం కనీస అవసరాలు కూడా తీర్చుకోలేకపోతున్నారు. పరిశ్రమ చుట్టూ జనావాసాలు, వ్యాపారం, వాణిజ్యం విస్తరించాల్సింది పోయి నీరుగారిపోతున్నాయి. సేవా రంగంలో పెరగాల్సిన కార్యకలాపాలు, కార్మికుల వేతనాలు నామమాత్రం కావడంతో అడుగు ముందుకేయలేకపోతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరుగుదలకు నోచుకోవడం లేదు. నేడు ఈ విధ్వంసకర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వేగం పెంచింది. కనుక ఈ 'అభివృద్ధి' నమూనాను అడ్డుకుంటేనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు.**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తనయుడు లోకేష్ వివిధ దేశాల్లో వున్న బడా పారిశ్రామిక సంస్థల అధినేతలను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని వారికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నెల 14, 15 తేదీలలో విశాఖపట్నంలో జరగబోతున్న పెట్టుబడుల భాగస్వామ్య సమిట్‌కు ఆహ్వానిస్తున్నారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతోటే స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ పేర 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చాలని, అందుకు ఏడాదికి 15 శాతం వృద్ధిరేటును సాధించాలని, రాబోయే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యాలను పెట్టుకొని విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. ఈ లక్ష్యాన్ని సాధించాలనే పేర రాష్ట్రంలో విచ్చలవిడిగా బలవంతపు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతోంది. విశాఖ-చెన్నై కారిడార్‌లో ఫార్మా, కెమికల్ పార్కులు, 9 భారీ పారిశ్రామిక కేంద్రాలు, 25 పారిశ్రామిక క్లస్టర్లు, 500 పారిశ్రామిక ఎస్టేట్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ప్రకటించింది.

ప్రైవేట్ పెట్టుబడులను రాబట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు, ఐ.టి, విద్యుత్, ఎలక్ట్రానిక్స్, టూరిజం వంటి అనేక రంగాలకు ప్రత్యేక విధాన పత్రాలను విడుదల చేసింది. జీఎస్టీ, పెట్టుబడుల సబ్సిడీ, విద్యుత్ రాయితీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చార్జీల రద్దు ఇలా వేల కోట్ల విలువ చేసే రాయితీలు ప్రకటించింది. అంతేగాక అతి తక్కువ రేటుకు భూములు కేటాయిస్తున్నది. రోడ్లు, విద్యుత్, రైల్వే లైన్లు, మంచి నీరు వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వ ఖర్చుతోనే కల్పిస్తున్నది. వీటన్నిటితో పాటు కార్మికుల పనిగంటలు 8 నుండి 10 గంటలకు పెంచింది. రాత్రి వేళల్లో మహిళా కార్మికులతో పని చేయించుకునేందుకు అనుమతిస్తూ చట్టం చేసింది.



డా॥ బి. గంగారావు

ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రైవేట్ పరిశ్రమల అభివృద్ధి స్వభావాన్ని, వాటిలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు, వారి జీవనం, పరిశ్రమ చుట్టూ ఉన్న ప్రాంతాల అభివృద్ధి, వాటి భౌగోళిక విస్తరణ, ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు, ప్రభుత్వ ఖజానాకు వస్తున్న ఆదాయం ఆ ప్రాంతంలో విస్తరించిన సేవారంగం స్థితి వంటి వాటిని పరిశ్రమలవారీగా పరిశీలిస్తే వాటి అభివృద్ధి నైజం, విచ్చలవిడి దోపిడీ, పాలకుల వర్గ నీతి సులభంగా అర్థం చేసుకోవచ్చు.

ఈ పరిశీలన కోసం విశాఖపట్నంలో ఉన్న ప్రభుత్వ పోర్టుతో పాటు రాష్ట్రంలో గంగవరం, కృష్ణపట్నం దగ్గర ఉన్న అదానీ పోర్టులను తీసుకున్నాం. ఈ పోర్టులకు సంబంధించి అందుబాటులో ఉన్న కొన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని విశ్లేషించాం. విశాఖపట్నం పోర్టు స్వాతంత్ర్యం ప్రారంభ కాలంలో ప్రభుత్వ రంగంలో ఏర్పడి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రభుత్వ పోర్టు. అదానీ పోర్టులు ప్రభుత్వ సహకారంతో ప్రైవేట్ రంగంలో 17 ఏళ్ల క్రితం ఏర్పడినవి. ఒక పరిశ్రమ, అది సృష్టించిన అభివృద్ధిని సమగ్రంగా అంచనా వేయటానికి దశాబ్దంన్నర కాలం చాలా ఎక్కువే.

మొదటగా విశాఖపట్నం పోర్టును పరిశీలిద్దాం. ఇది ప్రభుత్వ పెట్టుబడులతో ఏర్పడిన పోర్టు. ప్రస్తుతం 4 వేల మంది పర్మినెంటు, 10 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు వివిధ ప్రైవేటు సంస్థల కింద పోర్టు కార్యకలాపాల్లో పనిచేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సర ఆదాయ వ్యయాలను చూద్దాం. 82.62 మిలియన్ టన్నుల కార్గోను ఈ ఏడాది పోర్టు హ్యాండిల్ చేసింది. మొత్తం రూ.2074 కోట్లు ఆదాయంతో పాటు రూ.724 కోట్లు నికర లాభాలు గత ఏడాది ఆర్జించింది. వచ్చిన ఆదాయంలో కార్మికుల వేతనాలకు రూ.385 కోట్లు (18.56 శాతం) చెల్లించింది. కేంద్ర భద్రతా బలగాలైన సి.ఎస్.ఐ.ఎఫ్ జవానులు 501 మంది పని చేస్తున్నారు. వీరి వేతనాలకు రూ.48.45 కోట్లు చెల్లించింది. అలాగే పనిచేస్తున్న కార్మికులకు, రిటైర్ అయినవారి వైద్య సేవలకు 40 పడకల ఆసుపత్రి నిర్వహణకు, ఇతర రిఫరల్ హాస్పిటళ్లకు సుమారు రూ.74 కోట్లు ఖర్చు చేసింది. మరో రూ.328 కోట్లు పోర్టులో పనిచేసి రిటైరయిన సుమారు 16 వేల మందికి పెన్షన్ కోసం చెల్లించింది. ఈ సొమ్మును పోర్టు సొంత పెన్షన్ నిధి నుండి చెల్లించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ, కస్టమ్స్, కార్పొరేట్ పన్నుల రూపంలో రూ.356 కోట్లు (వచ్చిన మొత్తం ఆదాయంలో 17.16 శాతం) బదిలీ చేసింది. మహా విశాఖ నగర పాలక సంస్థకు ఆస్తి పన్ను రూ. 93.59 కోట్లు చెల్లించింది. ఇదిగాక నగరంలో వివిధ రోడ్ల నిర్మాణాల కోసం మరో రూ.15 వేల కోట్ల పైనే ప్రతి ఏడాది ఖర్చు చేస్తున్నది. సామాజిక బాధ్యత కింద అనేక వితరణ కార్యక్రమాలు కూడా చేపడుతున్నది.

ఈ పోర్టు విశాఖ నగర అభివృద్ధిలో చాలా కీలక పాత్ర పోషించింది. పోర్టు అభివృద్ధితో పాటు నగర అభివృద్ధి పెనవేసుకొని కొనసాగింది. పోర్టు ఆధారంగా ఎన్నో ప్రైవేట్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పడ్డాయి. వందల మంది పెట్టుబడిదారులు కొత్తగా అభివృద్ధి చెందారు. 1990 నాటికి 20 వేల మంది పర్మినెంట్ కార్మికులతో పాటు మరో 10 వేలమంది కాంట్రాక్ట్ కార్మికులు ఉండేవారు. విద్యా, వైద్య, గృహ, ఇతర అనేక సేవా రంగాలపై బలమైన ప్రభావాన్ని కలిగించింది. నగరంలో వ్యాపార వాణిజ్య అభివృద్ధికి జీవం పోసింది. నగర విస్తరణకు తోడ్పడింది. అందులో పనిచేసే వారికి శక్తివంతమైన ఆర్థిక జీవన శక్తిని కల్పించింది.

విశాఖపట్నంలో ఉన్న అదానీ గంగవరం పోర్టు అభివృద్ధిని పరిశీలిద్దాం. ఇది రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పిపిపి పేర ప్రైవేట్ రంగంలో 2004లో ఏర్పడిన పోర్టు. గత 17 ఏళ్ల నుండి కార్యకలాపాలు సాగిస్తున్నది. నాలుగేళ్ల క్రితం అదానీ యాజమాన్యం కేంద్ర బిజెపి సర్కార్ అండతో బలవంతంగా ఈ పోర్టును డివిఎస్ రాజు (ప్రాంతీయ పెట్టుబడిదారుడు) నుండి తమ వశం చేసుకుంది. రాష్ట్ర వాటాను కూడా కొనేసింది. ఈ పోర్టుకి రాష్ట్ర ప్రభుత్వమే 2 వేల ఎకరాల భూమిని కేటాయించింది.

2023-24లో 56 మిలియన్ టన్నుల కార్గోను హ్యాండిల్ చేసి రూ.1637 కోట్ల ఆదాయాన్ని గడించింది. రూ.719 కోట్లు లాభం పొందింది. అంటే మొత్తం ఆదాయంలో 44 శాతం లాభం. కార్మికుల వేతనాలకు కేవలం 62 కోట్లు (మొత్తం ఆదాయంలో కేవలం 3.69 శాతం) మాత్రమే. మొత్తం 3 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వేతనం తప్ప ఇతర సదుపాయాలు ఏవీ కార్మికులకు ఉండవు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పన్నుల కింద రూ.115 కోట్లు (వచ్చిన మొత్తం ఆదాయంలో 6.84 శాతం) చెల్లించింది.

ఇక విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆస్తి పన్ను కేవలం ఏడాదికి 72 లక్షలు చెల్లిస్తున్నది. అదీ మానవతా దృక్పథంతో చెల్లిస్తున్నామని అదానీ యాజమాన్యం చెబుతున్నది. ఎందుకంటే గంగవరం పోర్టు స్థానిక మున్సిపల్ సంస్థకి ఎటువంటి పన్నులు చెల్లించకుండా ఉండటానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫైడ్ ఏరియాగా పోర్ట్‌ను జివిఎంసి నుండి విడదీసి ప్రకటించింది. మంచినీటి సరఫరాకి జివిఎంసి విశాఖపట్నం పోర్టుకి కిలో లీటర్ (1000 లీటర్లు) రూ.70 వసూలు చేస్తుంటే అదే అదానీ గంగవరం పోర్టుకు కేవలం రూ.20కే సరఫరా చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం అంతకు మించి ధర పెంచనీయడం లేదు.

కృష్ణపట్నం పోర్టు అదానీకి చెందిన మరొక పోర్టు. ఇది కూడా గంగవరం పోర్టు లాగే బిఓటీ (నిర్మాణం, నిర్వహణ, బదిలీ) ప్రాతిపదికన ఏర్పడిన పోర్టు. ఈ పోర్టుకు అవసరమైన 4898 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ పోర్టు కూడా 2009 నుండి కార్గో హ్యాండ్లింగ్ కార్యకలాపాలను ప్రారంభించింది. దీనిని కూడా ప్రధాని నరేంద్ర మోడీ ప్రోద్బలంతో నవయుగ విశ్వేశ్వరయ్య (ప్రాంతీయ పెట్టుబడిదారుడు) నుంచి అదానీ బలవంతాన నాలుగేళ్ల క్రితం లాగేసుకున్నాడు. ఇటీవల ఈ పోర్టులో కీలకంగా ఉన్న కంటైనర్ టెర్మినల్‌ను మూసేసి తమిళనాడులోని ఎన్నూరు పోర్టుకు కంటైనర్ కార్యకలాపాలను తరలించింది. ప్రస్తుతం 4 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.

2024-25 సంవత్సరంలో ఈ పోర్టు కార్గో హ్యాండ్లింగ్ ద్వారా రూ.2974 కోట్లు ఆదాయం పొందింది. రూ.750 కోట్లు నికర లాభం గడించింది. రూ.113 కోట్లు కార్మికుల వేతనాలపై ఖర్చు చేసింది. అంటే మొత్తం ఆదాయంలో వేతనాల వాటా కేవలం 3.79 శాతం మాత్రమే. ఈ వేతనాల్లో కూడా కేవలం అదానీ పోర్టు యాజమాన్యం అధీనంలో ప్రత్యక్షంగా పనిచేసే పర్మినెంట్ కార్మికులకు రూ.44.87 కోట్లు చెల్లించింది. మిగిలింది పోర్టులో వివిధ ఏజెన్సీల కింద పలు పేర్లతో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల కోసం ఆయా ఏజెన్సీలకు చెల్లించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో రూ.252 కోట్లు (మొత్తం ఆదాయంలో 8.47 శాతం) చెల్లించింది.

అదానీ రెండు పోర్టులు ఆధునిక కార్మిక దోపిడీ జైళ్లుగా మారాయి. ఈ పోర్టులకు వస్తున్న ఆదాయంలో వేతనాలకు ఎంత ఖర్చు చేస్తున్నారో పైన తెలిపిన వివరాల్లో చూశాం. ఐటిఐ, పాలిటెక్నిక్ చదివి టెక్నీషియన్‌గా ఏడేళ్ళ నుండి పనిచేస్తున్న వారికి రూ.16 వేల లోపే జీతం ఉంటుంది. ఇంజనీరింగ్ డిగ్రీ చదివిన వారికి ప్రారంభంలో రూ.15 వేలు, ఐదేళ్లయినా రూ.20 వేలు దాటదు.

గంగవరం పోర్టులో నిర్వాసితుల కోటా కింద 600 మంది మత్స్యకారులకు ఉద్యోగం ఇచ్చారు. వీళ్ళ ఉద్యోగ సర్వీసు 14 నుండి 16 ఏళ్లు వుంటుంది. అందరికీ రూ.17 వేలు లోపే వేతనాలు. వీరు చేరిన దగ్గర నుండి తొలగించటానికి చేయని కుట్రంటూ లేదు. అదానీ రావటంతోటే అందరినీ తొలిగించేశారు. పోర్టు నిర్మాణం సందర్భంగా మత్స్యకారుల జీవనాధారానికి జట్టీ కట్టిస్తామని ఒప్పందం చేశారు. నేటికి కట్టలేదు. ఒప్పందంలో పేర్కొన్న నష్ట పరిహారాలను ఇంకా కొన్ని అమలు చేయకుండా మోసం చేశారు. కృష్ణపట్నం పోర్టు దగ్గర ఉన్న మత్స్యకారులకు కూడా ఇలాంటి ద్రోహమే జరిగింది. అక్కడా జట్టీ కట్టలేదు.

కృష్ణపట్నం పోర్టు, గంగవరం పోర్టు లోనూ స్థానికులకు ఉపాధి ఇవ్వడం లేదు. ఒరిస్సా, జార్ఖండ్ వంటి రాష్ట్రాల నుండి వలస కార్మికులను రప్పిస్తున్నారు. ఈ రెండు పోర్టుల వల్ల ఆ ప్రాంతం విస్తరణ లేదు సరికదా అవి వెదజల్లే విష కాలుష్యానికి రోగాల పాలవుతున్నారు. ముత్తుకూరు కృష్ణపట్నం పక్కనే ఉన్న మండల కేంద్రం. ఇప్పటికే ఆ గ్రామంలో వ్యాపార, వాణిజ్య, సేవా రంగాలు బాగా విస్తరించి పెద్ద మున్సిపాలిటీగా పరివర్తన జరిగి వుండాల్సింది. కానీ అక్కడి ప్రజలు నెల్లూరు నగర బాట పట్టాల్సి వస్తున్నది. గంగవరం గ్రామ ప్రజలు కూడా తమ గ్రామాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుకుంటున్నారు.

స్థూలంగా చూస్తే రాష్ట్రంలో ప్రైవేట్ పరిశ్రమలు విధ్వంసకర అభివృద్ధిని సృష్టిస్తున్నాయి. అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ దోపిడీ చేస్తున్నాయి. వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నా కార్మికులు మాత్రం కనీస అవసరాలు కూడా తీర్చుకోలేక పోతున్నారు. పరిశ్రమ చుట్టూ జనావాసాలు, వ్యాపారం, వాణిజ్యం విస్తరించాల్సింది పోయి నీరుగారిపోతున్నాయి. సేవా రంగంలో పెరగాల్సిన కార్యకలాపాలు, కార్మికుల వేతనాలు నామమాత్రం కావడంతో అడుగు ముందుకు వేయలేకపోతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరుగుదలకు నోచుకోవడం లేదు. నేడు ఈ విధ్వంసకర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వేగం పెంచింది. కనుక ఈ 'అభివృద్ధి' నమూనాను అడ్డుకుంటేనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

అంతర్జాతీయం

న్యూయార్క్ మేయర్ బరిలో సోషలిస్టు మమ్దానీ ఊపు!



ఎం. కోటేశ్వరరావు

భారతీయ కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు న్యూయార్క్ మేయర్ ఎన్నిక పోలింగ్ ప్రారంభమైంది. మనకు న్యూయార్క్ నగరానికి పదిన్నర గంటలు ఆలస్యంగా తెల్లవారుతుంది. పోలింగ్ ఉదయం ఆరుగంటలకు మొదలై రాత్రి తొమ్మిది గంటలకు ముగుస్తుంది. పోలింగ్‌కు కొద్ది గంటల ముందు వెల్లడైన సర్వేలన్నీ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి సోషలిస్టును అని సగర్వంగా ప్రకటించుకున్న జోహ్రాన్ మమ్దానీ గెలుపు బాటలో ఉన్నట్లు ప్రకటించాయి. ఎమర్సన్ కాలేజి చివరి సర్వేలో జోహ్రాన్‌కు 50 శాతం, సమీప ప్రత్యర్థి ఆండ్రూ కుమోకు 25, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కర్టిస్ సిల్వాకు 21 శాతం మద్దతు ఉన్నట్లు పేర్కొన్నారు. అమెరికాలో జరిగే ఎన్నికల సర్వేల్లో కూడా తేడాలు ఉంటాయి. అయితే ఎక్కువ భాగం వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఈ పూర్వ రంగంలోనే నవంబరు ఒకటవ తేదీన జరిపిన మరొక సర్వే ప్రకారం మమ్దానీ జోహ్రాన్‌కు 41 శాతం, కుమోకు 34 శాతం మంది కర్టిస్‌కు 24 శాతం మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఇదే సంస్థ మూడవ తేదీన జరిపిన సర్వేలో మద్దతు శాతాలను వరుసగా 43.9, 39.4, 15.5 శాతంగా ఉన్నట్లు పేర్కొన్నది. బహుశా ఈ కారణంగానే స్వంత పార్టీని పక్కన పెట్టి ట్రంప్ స్వతంత్ర అభ్యర్థి ముసుగులో ఉన్న డెమోక్రటిక్ పార్టీ తిరుగుబాటుదారుకు మద్దతు ప్రకటించాడా అన్న అనుమానాలు కూడా లేకపోలేదు. అమెరికాలో ఉన్న నిబంధనల ప్రకారం ప్రకటిత సమయానికి ముందే 7,35,000 మంది ఓట హక్కు వినియోగించుకున్నారు. ఇప్పటికే ఓటు వేసిన వారిలో 58 శాతం మమ్దానీకి వేసినట్లు, వేయాల్సిన వారిలో 45 శాతం ఆయనకే మొగ్గు చూపుతున్నట్లు సర్వేలు వెల్లడించాయి.

జోహ్రాన్ మమ్దానీ గెలిస్తే ఆర్థిక, సామాజిక విపత్తు సంభవిస్తుందని, అతను గెలిస్తే తాను నిబంధనల మేరకు తప్ప అదనపు నిధులు విడుదల చేసేది లేదని, తన మద్దతు డెమోక్రటిక్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థి మాజీ గవర్నర్ ఆండ్రూ కుమోకు ఇస్తున్నట్లు సోమవారం రాత్రి డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. కమ్యూనిస్టు జోహ్రాన్, చెడ్డ అభ్యర్థి కుమోలలో ఎవరో ఒకరిని ఎంచుకోవాలి గనుక తాను కుమోనే ఎందుకున్నట్లు చెప్పాడు. వ్యక్తిగతంగా అతనంటే మీకు అభిమానం ఉందా లేదా అని కాదు, మరొక మార్గం లేదు గనుక కుమోను బలపరచాలి. మమ్దానీని ఓడించగలిగింది అతనే అని ట్రంప్ పేర్కొన్నాడు. ఒక అధ్యక్షుడిగా అదనంగా నిధులు ఇవ్వటం కష్టం, ఎందుకంటే మీరు గనుక కమ్యూనిస్టును ఎన్నుకుంటే నగరానికి ఇచ్చే నిధులన్నింటినీ మీరు వృధా చేసినట్లే అని ఒక టివీలో ట్రంప్ చెప్పాడు. వేయి సంవత్సరాలుగా విఫలమైన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని మమ్దానీ అనుసరిస్తున్నాడని అన్నాడు. జోహ్రాన్ అభ్యర్థిగా ఎన్నికైనప్పటి నుంచి అతను కమ్యూనిస్టు అని పదే పదే ట్రంప్ ఓటర్లను ఆకర్షించేందుకు చూశాడు. అతగాడికి కొమ్ము కాసే మీడియా యాజమాన్యాలు, వాటిలో పని చేసే యాంకర్లు రాజును మించిన రాజభక్తిపరులుగా మారారు. ఫాక్స్ న్యూస్ టీవీ యాంకర్ ఊగిపోతూ...జోహ్రాన్ మమ్దానీ, అతని అనుచరులు కమ్యూనిస్టులు, తీవ్రవాదులు. వారిని దెబ్బ తీసేందుకు కమ్యూనిస్టులపై విషం చిమ్మటంలో పేరు మోసిన జో మెకార్థీని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నాడు. ప్రచ్ఛన్న యుద్ధంలో అమెరికా గెలిచినప్పటికీ మార్క్సిజం బతికిందని దాంతో విశ్వవిద్యాలయాల్లోని టీచర్లకు ధైర్యం వచ్చిందన్నాడు. అందువలన వలస వచ్చేవారిని, సిద్ధాంతాలను ఎక్కించటాన్ని అడ్డుకోవాలి, కమ్యూనిస్టుకు ఓటు వేయాలనే, నగర నాశనాన్ని కోరుకొనే వారిని బయటకు నెట్టాలన్నాడు. అందరం కూర్చుని కమ్యూనిస్టు ఎన్నిక కాకుండా చూడాలి, అధికారికంగా నమోదు కాని, పౌరులు కాని వారు కూడా ఓట్లు వేస్తున్నారని ఆరోపించాడు. అమెరికా తిరోగామి మీడియాలో ఇలాంటి వారు కోకొల్లలు.

మమ్దానీ పక్కా కమ్యూనిస్టు అని ప్రకటించిన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కుట్ర చేసి ఫలితాలను తారుమారు చేస్తే తప్ప ప్రపంచ పెట్టుబడిదారుల కుంభస్థలం మీద తొలిసారిగా ఒక సోషలిస్టు గద్దెనెక్కటం ఖాయం అని చెప్పవచ్చు. మత కళ్లద్దాలతో చూసిన వారు తొలి ముస్లిం మేయర్ అవుతారంటూ చెప్పారు. ఒక పురోగామివాదిగా మమ్దానీ అసలు డెమోక్రటిక్ అభ్యర్థిగా ఎన్నిక అవకుండా మొగ్గలోనే తుంచేందుకు ఆ పార్టీలోని మితవాద, పురోగామివాద వ్యతిరేకశక్తులు అన్ని విధాలుగా ప్రయత్నించాయి. డెమోక్రటిక్ పార్టీలోని మితవాదులతో సహా ప్రతిపక్షం అంతా ఒక్కటి, మమ్దానీ ఒక్కడిగా రంగంలో ఉన్నాడు. ట్రంప్ చివరికి ఎంతగా దిగజారాడంటే తమ పార్టీ అభ్యర్థి కర్టిస్ సిల్వాకు వేసే ఓటు మమ్దానీ కి వేసినట్లుగానే పరిగణించాలన్నాడు. కొన్ని సమయాలలో కొందరు అన్నట్లుగా ఒక సోషలిస్టు విసిరిన సవాలును ఎదుర్కొనేందుకు మిగతా సమయాలలో దెబ్బలాడుకొనే రిపబ్లికన్లు, డెమాక్రాట్లు ఎప్పుడైనా తమకే ఎసరు వస్తుందని భావిస్తే ఇద్దరు కలసిపోతారనేందుకు తాజా పరిణామం తార్కాణం. ఈ అంశం అనేక మందిలో భ్రమలను పోగొట్టి తామెటో నిర్ణయించుకొనేందుకు పనికి వస్తుందని, రానున్న రోజుల్లో డెమోక్రటిక్ పార్టీలోని మితవాద శక్తులకు ఎదురుదెబ్బలు తగలటం అనివార్యమని చెప్పవచ్చు. ఆఫ్రికాలో జన్మించిన 34 ఏళ్ల జోహ్రాన్ గెలిస్తే ఒక దక్షిణాసియా సంతతి, ముస్లిం సామాజిక తరగతికి చెందటమేగాక తొలి సోషలిస్టు మేయర్‌గా చరిత్రకెక్కనున్నాడు. ప్రచారంలో డెమోక్రటిక్ సోషలిస్టునని చెప్పుకున్నాడు తప్ప ఇతర అంశాలకు చెందిన మనోభావాలను ముందుకు తెచ్చేందుకు ప్రయతించకుండా ఎంతో హుందాగా వ్యవహరించాడని చెప్పవచ్చు. అతన్ని సోషలిస్టుగా వర్ణించినా తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని అనేక మంది చెప్పటం అమెరికా సమాజంలో వస్తున్న మార్పుకు నిదర్శనం.

ఈ ఎన్నికల ఫలితం, పర్యవసానాలు వచ్చే ఏడాది జరిగే పార్లమెంటు మధ్యంతర ఎన్నికల మీద కూడా ప్రభావం చూపవచ్చని చెబుతున్నారు. ఆ కారణంగానే ట్రంప్ స్వంత పార్టీ అభ్యర్థిని పక్కన పెట్టటమే కాదు, అతగాడికి ఓటేస్తే మమ్దానీ కి ఓటేసినట్లే అని చెప్పేంతవరకు వెళ్లాడు. చిత్రం ఏమిటంటే ట్రంప్‌ను వ్యతిరేకించిన ఎలన్ మస్క్ కూడా ఇదే చెప్పాడు. మమ్దానీ ఓటమికి అన్ని రకాల శక్తులు ఏకమైనా సర్వేలు అతనికి అనుకూలంగా చెప్పాయి. ముందే చెప్పుకున్నట్లు ఎంతకైనా తెగించే ట్రంప్ ఉన్నందున ఫలితాన్ని తారుమారు చేస్తాడా? చూద్దాం!



ఎం. కోటేశ్వరరావు

కేరళ స్టోరీ
అందరికీ ఆదర్శం

కత్తిరింపులు

సామాజిక, మానవ వికాసంలో అలాగే అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చదగిన ఆరోగ్య సంరక్షణా వ్యవస్థల్లో అద్భుతమైన రికార్డు కేరళ స్వంతం. అటువంటి కేరళ తాజాగా 69వ రాష్ట్రావతరణ రోజైన నవంబరు 1న మరో మైలు రాయిని కైవసం చేసుకుంది. దుర్భర దారిద్ర్య నిర్మూలన రికార్డును సాధించింది. పకడ్బందీగా ప్రణాళికాబద్ధంగా రూపొందించిన కార్యక్రమంతో... స్థానిక స్వపరిపాలనా సంస్థల నేతృత్వంలో పలు సంస్థల ప్రమేయంతో, మరోవైపు విస్తృత స్థాయిలో ప్రజా ప్రాతినిధ్యంతో నాలుగేళ్ళ పాటు చేసిన కృషి ఫలితంగా ఈ విజయం సాధ్యమైంది. 2021 మే లో రెండవసారి పినరయి విజయన్ నేతృత్వంలో ఏర్పడిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తొలి మంత్రివర్గ సమావేశంలో తీవ్ర పేదరిక నిర్మూలనా కార్యక్రమం (ఇపిఇపి) ప్రారంభించింది. కేరళలోని ప్రజా అభివృద్ధి కార్యక్రమాలకు, వికేంద్రీకరణ ప్రణాళికలకు ప్రాధాన్యతనిచ్చిన వరుస ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాలకే ఆ ఘనత దక్కుతుంది. వీటి ఫలితంగానే 1973-74లో 59.8 శాతంగా వున్న పేదరికం 2011-12లో 11.3 శాతానికి తగ్గిపోయింది. జనాభా నిష్పత్తిని బట్టి కేరళలో పేదరికం అతి తక్కువగా వుందని నీతి ఆయోగ్‌కి చెందిన జాతీయ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (2023) పేర్కొంది. కేరళ జనాభాలోని కేవలం 0.55 శాతం మంది మాత్రమే పలు రకాలుగా పేదలు-ఇది జాతీయ సగటు 14.96 శాతం కన్నా బాగా తక్కువ. ఎవరికి వారు స్వయంగా నమోదు చేయించుకునే పద్ధతిపై ఆధారపడడానికి బదులుగా, ప్రభుత్వం దాదాపు 4 లక్షల మంది సుశిక్షితులైన ఎన్యూమరేటర్లను నియమించింది. వీరికి చురుకుగా పని చేసే స్థానిక స్వపరిపాలనా వ్యవస్థ, కుటుంబశ్రీ వర్కర్లు తోడయ్యారు. వీరందరూ కలిసి నిరుపేదలను గుర్తించారు. పలు దశల్లో, స్థాయిల్లో పరిశీలనలు, గణనలు పూర్తయిన అనంతరం, తీవ్ర పేదరికంలో వున్న 64,006 కుటుంబాలను గుర్తించారు. ఈ కుటుంబాల్లో మొత్తంగా 1,03,099 మంది వున్నారు. వీరిలో చాలామందికి కనీస పత్రాలు, కార్డులు కూడా లేవు. వీరందరినీ కూడా ఆహారం, ఆరోగ్యం, జీవనోపాధి మార్గాలు, వుండేందుకు ఇల్లు...ఈ నాలుగు అంశాలను ప్రామాణికంగా పెట్టుకుని గుర్తించారు. ఇటువంటి భిన్నమైన అవసరాలకు ఒకేరకమైన పరిష్కారం సరిపోదు. అందువల్ల సంక్షేమ పాలనలోనే ఒక ప్రయోగం చేపట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. గుర్తించిన ప్రతీ కుటుంబానికి వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక సూక్ష్మ ప్రణాళికలను రూపొందించారు. అలాగే గుర్తింపు పత్రాలు ఇవ్వడం, ఇళ్ళు కట్టించి ఇవ్వడం, జీవనోపాధులు కల్పించడం, రెగ్యులర్‌గా మందులు, భోజనం, ఉపశమన చర్యలు, కొన్ని కేసుల్లో అవయవాల మార్పిడి వంటి పలు రకాల కీలకమైన తోడ్పాటును కూడా ప్రభుత్వం అందించింది.

పేదరికంపై పోరాటమన్నది ఎప్పటికీ అంతమంటూ లేని ఒక కర్తవ్యం. తీవ్ర పేదరికాన్ని (ముఖ్యంగా గిరిజన జనాభా దుస్థితికి సంబంధించి) నిర్మూలించాలనే వాదనపై విమర్శలు తప్పించుకోలేనివి. మళ్ళీ పేదరికం తలెత్తకుండా నివారించేందుకు, కొత్తగా ఏ కుటుంబం కూడా తిరిగి తీవ్రమైన పేదరికంలోకి జారకుండా వుండేలా రాష్ట్ర ప్రభుత్వం ఇపిఇపి 2.0ను ప్రారంభించింది. అన్ని రూపాల్లోని పేదరికాన్ని బృహత్తర పంథాలో ఎదుర్కొంటామని ఎల్‌డిఎఫ్ ప్రతిన పూనింది. 'కేరళ మోడల్'ను విమర్శించేవారు తరచుగా ప్రతిష్టంభించిన పురోగతి, పెరుగుతున్న నిరుద్యోగం వంటి అంశాలను ఆ మోడల్ వైఫల్యానికి సాక్ష్యాలుగా చూపుతారు. ఈ రంగాల్లో లోటును పూడ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టులను, హైటెక్ హరిత పరిశ్రమలను వేగవంతం చేసింది. నిరుద్యోగితను రూపుమాపేందుకు విద్యావంతుల్లోని నైపుణ్యాలను అభివృద్ధి పరుస్తోంది. సామాజిక భద్రత లేదా సుస్థిరత విషయంలో రాజీ పడకుండా ప్రగతిశీల పాలన అనేది అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి రెండింటిలోనూ ఒకేసారి వేళ్ళూనుకుపోతుందని ఇపిఇపి రుజువు చేస్తోంది. ప్రజలే పరమావధిగా నడిచే ఈ నమూనా లోపరహితంగా వుండకపోవచ్చు. కానీ కింది స్థాయి నుండి ఎదుగుతూ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేదిగా వుంటుంది. ఇది ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను అందచేస్తోంది. ఈ కేరళ స్టోరీ కచ్చితంగా ప్రచారం చేయదగ్గది.

/ 'హిందూ' సంపాదకీయం /

టీచర్ సస్పెండ్

ప్రజాశక్తి - మెళియాపుట్టి

విద్యార్థులతో కాళ్లు నొక్కించుకున్న ఘటనలో టీచర్‌ను సస్పెండ్ చేస్తూ సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హోరా హోరీగా న్యూయార్క్ మేయర్ ఎన్నికలు

న్యూయార్క్ : న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల పోలింగ్ మంగళవారం ప్రారంభమయింది. 51 లక్షల మంది న్యూయార్క్ వాసులు కొత్త మేయర్‌ను ఎన్నుకోనున్నారు. ప్రధాన పోటీదారులైన మమ్దని, క్యూమోలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు..ఇవి ప్రతీ నాలుగేళ్లకు వచ్చే ఎన్నికలే అయినా ఈ సారి జరుగుతున్న ఎన్నికలు ఆసక్తిని రేపాయి. దానికి కారణం 34 ఏళ్ల సోషలిస్టు జొహ్రాన్ మమ్దాని పోటీచేయడమే. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే మమ్దానిని విమర్శించడంతో ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందారు. పోలింగ్‌కు కొద్ది గంటల ముందు కూడా మమ్దాని కమ్యూనిస్టు, ఆయన గెలిస్తే నిధులు ఇవ్వనని బెదిరించారు. ఆయన యూదు వ్యతిరేకి, యూదులెవ్వరూ మమ్దానికి ఓటు వేయవద్దు అంటూ మంగళవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేసి రెచ్చగొట్టారు. తమ పార్టీ అభ్యర్థికి కాకుండా స్వతంత్ర అభ్యర్థి ఆండ్రూ క్యూమోను గెలిపించాలనటం కొసమెరుపు. మరోవైపు ఇలాన్ మస్క్ రిపబ్లికన్ అభ్యర్థి కర్టిస్ స్లివాకు మద్దతు తెలిపారు. మమ్దాని సోషలిస్టు తరహా విధానాలను ప్రచారం చేస్తూ యువతను ఆకట్టుకున్నారు. అమెరికా సమాజంలో వెల్లువెత్తుతున్న అసంతృప్తికి ఈ ఎన్నికలు ప్రతీక కానున్నాయని అందుకే అన్ని సర్వేలు జోహ్రాన్ మమ్దాని వైపు మొగ్గు చూపుతున్నాయని పలువురు భావిస్తున్నారు.య భారత కాలమాన ప్రకారం బుధవారం తెల్లవారుజామున 2 గంటలకు పోలింగ్ ముగియనుంది. ఫలితాలు అదే రోజున వెలువడనున్నాయి.



విజయంపై ధీమా : మద్దతుదారులతో కలిసి అభివాదం చేస్తున్న డెమొక్రాటిక్ అభ్యర్థి జొహ్రాన్ మమ్దాని

విజయవాడలో నేటి నుంచి 'వసంతం-2025'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన నేటి నుంచి రెండు రోజుల పాటు 'వసంతం 2025' నిర్వహించనున్నట్లు కౌన్సిల్ చైర్ పర్సన్ ఎస్.రంజన, వైస్ చైర్ పర్సన్ బి.సుజాత తెలిపారు. నగరంలోని శ్రీ శేష సాయి కళ్యాణ వేదికలో మంత్రి నారా లోకేష్, గౌరవ అతిథిగా ఎన్.బ్రాహ్మణి పాల్గొంటారని తెలిపారు. శేష సాయి కళ్యాణ వేదికలో రంజన, సుజాత మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... ఈనెల 5, 6 తేదీల్లో ఉదయం పది నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు జరిగే 'వసంతం'లో పశ్చిమ బెంగాల్, ఒడిశా, బనారస్, కోట, గద్వాల్, చందేరి, లక్నో చికంకరి, కాంజీవరం, కర్ణాటక, ప్రింటెడ్ టస్సర్‌లో సాధారణ దుస్తులు, పిచ్చై ఆర్ట్స్, లెదర్ పప్పెట్రి, జూటిస్ బట్టలు, సిరామిక్స్, నేత వంటి అనేక చేతి ఉత్పత్తులు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. యువత, చిన్న పిల్లలకు చెందిన దుస్తులను ప్రదర్శించనున్నట్లు, దేశం నలుమూలల నుండి ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. 65కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే ఆదాయాన్ని చేతివృత్తుల వారి కోసం, ఇలాంటి మరెన్నో కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగిస్తామని తెలిపారు.

ప్రజాదర్బార్‌కు భారీగా ప్రజలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న టిడిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్ నిర్వహించారు. పలు జిల్లాల నుంచి పెద్దయెత్తున ప్రజలు వారి సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి లోకేష్ హామీనిచ్చారు. శ్రీశైలం ఐటిడిఎ (పిటిజి) చెంచు ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోని ప్రకాశం జిల్లా అటవీ ప్రాంతంలోని గిరిజన చెంచు, ఆదివాసీ గూడెంలో గిరిజన సంక్షేమశాఖ ద్వారా నూతన పాఠశాలల మంజూరుకు చర్యలు తీసుకోవాలని నల్లమల గిరిజన చెంచు(పిటిజి) సంక్షేమ సంఘం ప్రతినిదులు విజ్ఞప్తి చేశారు. ఎపి జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్స్‌లో పనిచేస్తున్న సుమారు 23,500 మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వేతన సవరణ చేయడంతోపాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఎపి పవర్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వివిధ జిల్లాలకు చెందిన పలువురు తమపై గత వైసిపి పాలనలో వేధింపులకు గురయ్యామని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.



మహిళ నుంచి వినతిపత్రం తీసుకుంటున్న లోకేష్

జగన్‌కు వాస్తవాలు తెలియవు..

రాష్ట్రానికి చుట్టపుచూపుగా అప్పుడప్పుడు వచ్చే మాజీ సిఎం వైఎస్ జగన్‌కు వాస్తవాలు తెలియక మాట్లాడుతున్నారని ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలంటే తనకు గౌరవమని, దేశమంటే భక్తి అని, అందుకే ముంబయిలో జరిగిన మహిళల వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ చూడటానికి వెళ్లినట్లు తెలిపారు.

కల్తీ మద్యం కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్/తంబళపల్లె

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో గోవాకు చెందిన ఇద్దరిని ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గోవాలో పనిచేస్తున్న శిబు(45) జనేష్(50)లను రెండు రోజుల క్రితం మదనపల్లె ఎక్సైజ్ పోలీసుస్టేషన్ తీసుకొచ్చి జిల్లా ఎక్సైజ్ ఎఇఎస్ జోగేంద్ర విచారించారు. విచారణలో నిందితుల ప్రమేయంపై పూర్తి వివరాలను సేకరించారు. కల్తీ మద్యం తయారీకి స్పిరిట్‌ను సరఫరా చేసినట్లు నేరం అంగీకరించడంతో ఇద్దరిని అరెస్టు చేసి తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి వారికి రిమాండ్ విధించారు.



డిఎస్‌పి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత

పోలీసు శాఖకు మౌలిక సదుపాయాల కల్పన

- వెలగపూడిలో డిఎస్‌పి కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి అనిత

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

పోలీసు శాఖకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పోలీసు శాఖ సమర్థవంతంగా పని చేయాలంటే సదుపాయాల కల్పన అవసరమన్నారు. రాజధాని వెలగపూడిలో డిఎస్‌పి కార్యాలయాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం హోంమంత్రి, అధికారులు కార్యాలయం ముందు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. 2014 - 19 లో టిడిపి ప్రభుత్వం హయాంలో ఎకరం స్థలంలో డిఎస్‌పి కార్యాలయం నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణం సంగతి పట్టించుకోలేదన్నారు. పోలీసుల ఆరోగ్యం, భద్రతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని తెలిపారు. రాజధానిలో ఎస్‌పి క్యాంపు కార్యాలయం ఏర్పాటుతో పాటు సిబ్బంది సంఖ్యను పెంచుతామన్నారు. 6,100 మంది పోలీసులను రిక్రూట్‌మెంట్ ద్వారా తీసుకోవడం జరిగిందని, శిక్షణలో ఉన్న వారందరూ త్వరలో విధుల్లో చేరతారని తెలిపారు. ప్రతిపక్షాల ఆరోపణలను సమర్థవంతంగా ఎదుర్కొంటామని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాన్ని ఉపేక్షించబోమ న్నారు. కార్యక్రమంలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, ఇతర పోలీస్ అధికారులు, రాజధాని రైతులు పాల్గొన్నారు.

అబద్ధాల ప్రచారమే జగన్‌కు ముఖ్యం : అచ్చెన్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి మంచి చేయడానికి బదులు అబద్ధాల ప్రచారమే ముఖ్యమని భావించే మాజీ సిఎం జగన్ భావిస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజలకు చేసిన మోసాలు, మాట తప్పడం, వాగ్ధానాలన్నింటినీ మరిచి ఇప్పుడు నీతిమంతుడిగా నటించడం జగన్ స్వభావమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు రేయింబవళ్లు శ్రమిస్తుంటే, ఆ దిశగా ఒక్క అడుగు వేయలేని ప్రతిపక్ష నేత ఆరోపణలు చేయడం సముచితం కాదన్నారు.

గిరిజన పాఠశాలల్లో సదుపాయాలకు రూ.113 కోట్లు

- మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9 ఐటిడిఎల్లోని 757 గిరిజన పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.113 కోట్లు మంజూరు చేసినట్లు మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఇందులో రూ.83 కోట్లను గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, రూ.30 కోట్లను గురుకుల పాఠశాలలకు ఇచ్చారన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు గతేడాది రూ.155 కోట్లు విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో 757 గిరిజన పాఠశాలలున్నాయని, వీటిలో 199 గురుకులాలు, 558 ఆశ్రమ పాఠశాలలున్నాయని తెలిపారు. వీటన్నింటిలో ఆర్ఒ ప్లాంట్లు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలను కల్పించనున్నట్లు చెప్పారు. డిఎస్‌సితో అన్ని గిరిజన పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారని పేర్కొన్నారు. 1,100 మంది కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. 150 మంది మెరిటోరియస్ విద్యార్థులను గుర్తించి వారికి ఎన్ఐటి, నీట్ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చి ప్రతి కేంద్రానికి టీచర్, ఆయాలను నియమించామని వెల్లడించారు. సాక్షం అంగన్వాడీలో దృశ్యశ్రవణ విధానంతో విద్యాబోధన చేసేందుకు అవసరమైన టివి, ఫర్నీచర్‌ను కొనుగోలు చేసే నిమిత్తం ఒక్కొక్క సాక్షం అంగన్వాడీ కేంద్రానికి రూ.1 లక్ష చొప్పున కేటాయించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం ట్రైకార్ రుణాలను మంజూరు చేయలేదని, గిరిజనుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రూ.24 కోట్లతో గోకులాలకు, రూ.20 కోట్లు ట్రైకార్ రుణాలకు కేటాయించినట్లు తెలిపారు.

కోలాహలంగా జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలు

- గురువారం ఫలితాలు వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు) విద్యార్థి సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పోలింగ్‌కు మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 గంటల వరకు విరామం ఇచ్చారు. అనంతరం తిరిగి ప్రారంభమైన పోలింగ్‌కు ముగింపు సాయంత్రం 5.30 గంటలకు అయినా అప్పటికే క్యూ లైన్లలో ఉన్న విద్యార్థులను అనుమతించారు. పూర్తిస్థాయి ఫలితాలు ఈ నెల 6న ప్రకటిస్తామని ఎన్నికల కమిటి తెలిపింది. నాలుగు కీలకమైన సెంట్రల్ ప్యానెల్ పదవుల (అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి)కు మొత్తం 20 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దాదాపు 9,043 మంది ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ బూత్ వెలుపల జెఎన్‌యుఎస్‌యు మాజీ అధ్యక్షురాలు, ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ఐషీఘోష్ మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమంపై తాము దృష్టి పెట్టామని, ఎన్నికల ప్రచారంలో కూడా ఇవే అంశాలను లేవనెత్తామని తెలిపారు. తమ వామపక్ష కూటమి నాలుగు సెంట్రల్ ప్యానెల్ పోస్టులను గెలుచుకుంటుందని పేర్కొన్నారు.

ఎన్ఆర్ఐ పెట్టుబడులకు ప్రోత్సాహం

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ దేశాల్లో కీలక స్థానాల్లో పనిచేస్తున్న ఎన్నారైలతో క్లబ్ ఏర్పాటు చేసి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అన్ని అవకాశాలనూ వారికి వివరించాలని అధికారులను రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. విదేశాల్లో స్థిరపడిన పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే విధంగా ప్రోత్సహించాలని, పారిశ్రామిక విధానాన్ని వారికి వివరించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ఎన్నారై క్లబ్‌లలో పెద్దయెత్తున ప్రచారం నిర్వహించాలని సూచించారు. విదేశీ సంస్థల్లో కీలక స్థానాల్లో పనిచేసే సిఇఒలు, సిఎఫ్ఒలు, సిటిఒలను ఈ క్లబ్‌లలో భాగస్వాములను చేయాలన్నారు. ఎపి ఎన్నార్టీ అధ్యక్షులు, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఈ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో కృషి చేయాలని సూచించారు. అలాగే ఎగుమతిదారులు, దిగుమతిదారులతో సైతం క్లబ్ ఏర్పాటు చేసి రాష్ట్రం నుంచి ఎగుమతులను ప్రోత్సహించాలన్నారు.

అమరావతిలో నిర్మించ తలపెట్టిన ప్రవాసాంధ్రుల ఐకానిక్ టవర్ల నిర్మాణ పనుల పురోగతిపై ఈ సందర్భంగా మంత్రి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్నార్టీ అధ్యక్షులు వేమూరి రవికుమార్, సిఇఒ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోయంబత్తూరులో విద్యార్థినిపై లైంగికదాడి

- కాళ్లపై కాల్పులు జరిపి.. నిందితులు అరెస్టు

కోయంబత్తూర్ : తమిళనాడులోని కోయంబత్తూరు విమానాశ్రయం సమీపంలో కళాశాల విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు సమయంలో పారిపోవడానికి ప్రయత్నించిన వారి కాళ్లపై కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా కోయంబత్తూరు నగర పోలీస్ కమిషనర్ శరవణ సుందర్ తెలిపిన వివరాల ప్రకారం... కోయంబత్తూరు ఎయిర్‌పోర్టు సమీపంలో ఆదివారం రాత్రి 10.40 గంటల సమయంలో ఓ కళాశాల విద్యార్థిని తన స్నేహితుడితో కారులో వెళ్తుండగా ముగ్గురు నిందితులు తవాసీ, కార్తీక్, కాళీశ్వరం వారిని అటకాయించారు. కారు అద్దాలు పగులగొట్టి బాధితురాలి స్నేహితుడిపై కొడవలితో దాడిచేశారు. అనంతరం విద్యార్థినిని దూరంగా తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆమె స్నేహితుడు పోలీసులకు ఫోన్ చేయగా, వారు ఘటనా ప్రాంతానికి చేరుకోవడాన్ని గమనించి నిందితులు గోడ దూకి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని మూడు లోకేషన్లలో గుర్తించి మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితులు ముగ్గురిపై హత్య, దొంగతనాలు తదితర కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఇద్దరు సొంత అన్నదమ్ములని, మరో వ్యక్తి వారికి బంధువు అని వెల్లడించారు.

మల్టీప్లెక్స్ టికెట్ ధరలపై ఆందోళన

- తగ్గించకపోతే థియేటర్లు ఖాళీ అవుతాయి
- సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరిక



న్యూఢిల్లీ : దేశంలోని మల్టీప్లెక్స్‌లలో సినిమా టికెట్ ధరలతోపాటు, పాప్‌కార్న్ ఇతర పానీయాల ధరలు అధికంగా ఉండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా నిర్ణయించాలని పేర్కొంది. లేదంటే ప్రేక్షకులు సినిమా హాళ్లకు రావడం మానేసి ఒటిటిల వైపు మొగ్గు చూపుతారని, అప్పుడు థియేటర్లు ఖాళీ అవుతాయని ధర్మాసనం హెచ్చరించింది. కర్ణాటక ప్రభుత్వం మల్టీప్లెక్స్ టికెట్ ధరలను రూ.200కు పరిమితం చేస్తూ ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఎఐ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. "మీరు వాటర్ బాటిల్‌కు రూ.100, కాఫీకి రూ.700 వసూలు చేస్తున్నారు. ధరలను తగ్గించి, ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా చేస్తే పరిశ్రమ బాగుపడుతుంది. లేకపోతే ప్రేక్షకులు రాక సినిమా హాళ్లు ఖాళీగా మిగిలిపోతాయి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జస్టిస్ నాథ్ మాట్లాడుతూ.. "సినిమా బిజినెస్ ఇప్పటికే పడిపోతోంది. ప్రేక్షకులు ఆనందపడేలా మరింత రీజనబుల్‌గా ధరలు ఉండాలి. లేకపోతే థియేటర్లు ఖాళీ అవుతాయి. టికెట్ ధర రూ.200 ఉండాలని హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాన్ని సమర్థిస్తున్నాం" అని చెప్పారు. దీనిపై పిటిషనర్ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తూ ధరలను నిర్ణయించడం యాజమాన్యాల స్వేచ్ఛకు సంబంధించిన అంశమంటూ తాజ్ హోటల్‌లో కాఫీ ధరను ప్రస్తావించారు. హైకోర్టు పెట్టిన షరతులు ఆచరణ సాధ్యం కావని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అత్యధికంగా టికెట్లు అమ్ముడవుతున్నాయని, టికెట్ కౌంటర్‌లో కొనేవారి గుర్తింపు కార్డు (ఐడి) సేకరించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది స్పందిస్తూ ప్రభుత్వం ఈ కేసులో గెలిస్తే ప్రేక్షకులు అధికంగా చెల్లించిన టికెట్ ధరను తిరిగి చెల్లించేందుకు వీలుగా ఉండేందుకే హైకోర్టు ఆ రూల్ పెట్టిందని వివరణ ఇచ్చారు. వాదనలు విన్న సుప్రీంకోర్టు ఈ పిటిషన్లపై నోటీసులు జారీ చేసింది. హైకోర్టు విధించిన మధ్యంతర షరతులు (టికెట్ కొనుగోలుదారుల ఐడి వివరాల సేకరణ వంటివి) తక్షణమే అమలు కాకుండా స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ప్రత్యర్థులు ఓటు వేయకుండా అడ్డుకోండి

- కేంద్ర మంత్రి లలన్‌సింగ్ వీడియో వైరల్
- బెదిరింపులపై ఎఫ్ఐఆర్

పాట్నా : పోలింగ్ తేదీన ప్రత్యర్థులు ఓటు వేయకుండా అడ్డుకోవాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ లలన్‌సింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ముంగేల్ లోక్‌సభ స్థానం పరిధిలోని మోకామాలో రికార్డయినట్టు సమాచారం. "పోలింగ్ రోజున బయటకు వెళ్లేందుకు అనుమతించకూడదని వ్యక్తులు కొందరు ఇక్కడ ఉన్నారు. వారిని ఇళ్లలోనే బంధించాలి. మిమ్మల్ని బెదిరిస్తే.. మీతో పాటే పోలింగ్ బూత్‌లకు ఈడ్చుకువెళ్లి, ఓటు వేయించి, తిరిగి ఇళ్లకు చేరేలా చూడాలి" అని లలన్ సింగ్ తన మద్దతుదారులను హెచ్చరిస్తుండటం తాజా వీడియోలో వినిపిస్తోంది.

ఇసి ఎక్కడుంది? : ప్రశ్నించిన ఆర్‌జెడి, కాంగ్రెస్

తాజా వీడియోపై ఆర్‌జెడి, కాంగ్రెస్ తీవ్రంగా స్పందించాయి. "ఎలక్షన్ కమిషన్ (ఇసి)పై బుల్డోజర్ నడుపుతూ ఓటు వేయకుండా ప్రజలను అడ్డుకోవాలని లలన్ సింగ్ వీడియోలో బెదిరిస్తున్నారు. ఇసి ఎక్కడ ఉంది" అని ఆర్‌జెడి ప్రశ్నించింది. "ఇది బీహార్‌లో గూండాగిరి, అడవి రాజ్ పాలనకు కొత్త ఉదాహరణ. ఓటమి భయంతో బిజెపి, జెడి(యు) నేతలు పోలింగ్ రోజున ప్రజలను ఇళ్లలో బంధించాలని, ప్రతిఘటిస్తే. ఓటు వేయడానికి వారిని ఈడ్చుకెళ్లాలని బహిరంగంగా చెబుతున్నారు" అని సీనియర్ కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలా ఎక్స్‌లో పేర్కొన్నారు.

రాజీవ్ రంజన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

ప్రతిపక్ష నేతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో రాజీవ్ రంజన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు పోలీసులు తెలిపారు. జన్ సురాజ్ పార్టీ మద్దతుదారుడు దులార్ చంద్ యాదవ్ హత్యకేసులో అనంత్ సింగ్, అతని సహచరులు-మణికాంత్ ఠాకూర్, రంజీత్ రామ్‌లను గత వారాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అనంత్‌సింగ్ తరపున రాజీవ్ రంజన్ ప్రచారాన్ని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

తెర వెనుక సారథి మజుందార్

- జాతీయ జట్టుకు ఆడకున్నా... ప్రపంచకప్ అందించిన కోచ్
- నేడు ప్రధానిని కలవనున్న జట్టు



ముంబయి: వన్డే ప్రపంచకప్ టైటిల్ కొట్టడంలో ఆటగాళ్ల పాత్ర ఎంత కీలకమో.. తెర వెనుక కోచ్ పాత్ర అంతకుమించి ఉంది. క్రీడాకారిణుల ఫిట్‌నెస్, జట్టు ఎంపిక, కెప్టెన్, ఆటగాళ్లకు దిశ నిర్దేశం, డ్రింక్స్‌బ్రేక్ సమయంలో కెప్టెన్‌కు ఎత్తుగడలను చేరవేయడం.. ఇలా ప్రతి విభాగంలో కోచ్ పాత్ర మరువలేనిది. ఇందుకు నిదర్శనమే వన్డే ప్రపంచకప్‌ను సాధించిన వెంటనే టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ పరిగెత్తుకొని వెళ్లి ఒక వ్యక్తి కాళ్లకు నమస్కరించి, ఆలింగనం చేసుకొని కన్నీళ్లు పెట్టుకోవడం. అతడు మరోవరో కాదు.. టీమిండియా హెడ్ కోచ్ అమోల్ మజుందార్. క్రికెటర్‌గా 21ఏళ్ల ప్రొఫెషనల్ కెరీర్‌లో ఏనాడూ జాతీయ జట్టుకు ఎంపకవ్వని ఆయన, ఇప్పుడు కోచ్‌గా మహిళా జట్టుకు దిశా నిర్దేశం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే భారత మహిళలజట్టును ప్రపంచ చాంపియన్స్‌గా తీర్చిదిద్దాడు.

మజుందార్ దేశవాళీ క్రికెట్ ఆడే క్రమంలో భారత క్రికెట్ జట్టులో మరో సచిన్ అవుతాడని భావించారు. దేశవాళీ క్రికెట్లో ముంబయి తరఫున పరుగుల వరద పారించాడు. 'ది వాల్'గా పేరు తెచ్చుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 171 మ్యాచుల్లో 11,167పరుగులు చేశాడు. ఇందులో 30సెంచరీల, 60అర్ధసెంచరీలు ఉన్నాయి. ఇక 113 లిస్ట్-ఎ క్రికెట్ మ్యాచుల్లో 3,286పరుగులు కొట్టాడు. 3సెంచరీలు, 26అర్ధసెంచరీలు చేశాడు. కానీ ఆయనకు ఒక్కసారి కూడా టీమిండియా తరఫున ఆడే అవకాశం దక్కలేదు. అయినా నిరుత్సాహానికి గురికాలేదు. భారత మహిళలజట్టుకు కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాక తన పూర్వ వైభవాన్ని రంగరించి క్రీడాకారిణులను మెరికల్లా తీర్చిదిద్దాడు. దీంతో భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ గెలవడంలో కోచ్‌గా కీలక పాత్ర పోషించాడు. ఫైనల్లో సౌతాఫ్రికాపై గెలిచిన తర్వాత టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ వెళ్లి ముజుందార్ కాళ్లు మొక్కింది. దీన్ని బట్టి భారత జట్టు కప్ గెలవడం వెనుక ఆయన కృషి, పట్టుదల ఎంత ఉందో అర్థం అవుతుంది. భారత జట్టుకు ఆడలేకపోయినప్పటికీ.. కోచ్‌గా ఆ సంతృప్తిని పూర్తి చేసుకున్నాడు.

దీప్తి శర్మ కొత్త చరిత్ర

మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లోనే కాదు.. టోర్నీ చరిత్రలో ఏ ప్లేయర్ సాధించని ఒక రికార్డును దీప్తి శర్మ ఈ ప్రపంచకప్‌లో నెలకొల్పింది. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో అర్ధసెంచరీతో పాటు ఐదు వికెట్లు తీసిన తొలి ప్లేయర్‌(పురుషులు, మహిళలు)గా చరిత్ర సృష్టించింది. ప్రపంచకప్‌లో 22 వికెట్లు తీసిన మూడో ప్లేయర్‌గా, ఒక వరల్డ్‌కప్ ఎడిషన్‌లో 200కు పైగా పరుగులు, 20కు పైగా వికెట్లు తీసిన తొలి క్రీడాకారిణిగా దీప్తి మరో రికార్డును నెలకొల్పింది. దీప్తి శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు దక్కిన సంగతి తెలిసిందే. ఇక భారత మహిళల జట్టు ప్రధాని నరేంద్ర మోడీని కలిసేందుకు మంగళవారం ముంబయి నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

మంధాన, రోడ్రిగ్స్, దీప్తిలకు ఐసిసి ఉత్తమ జట్టులో చోటు

దుబాయ్: ప్రపంచకప్ విజేత భారత జట్టులోని ముగ్గురు క్రికెటర్లు స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ ఐసిసి వుమెన్స్ వన్డే ప్రపంచకప్ 'టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్'లో చోటు దక్కించుకున్నారు. ఈ ముగ్గురు ప్లేయర్లు భారత్ సాధించిన చారిత్రాత్మక విజయంలో కీలకపాత్ర పోషించారు. టోర్నీలో నిలకడగా రాణించిన ప్రతీకా రావల్‌కు మాత్రం జట్టులో ఐసిసి చోటు దక్కలేదు. అయితే, సెమీఫైనల్‌కు ముందు గాయం కారణంగా టోర్నీ నుంచి ప్రతీకా వైదొలగడం కూడా ఒక కారణం. అలాగే, రన్నరప్ దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా నుంచి ముగ్గురు ప్లేయర్లకు ఐసిసి జట్టులో చోటు లభించింది. వన్డే వరల్డ్ కప్‌లో టీమిండియా ఓపెనర్ స్మృతి మంధాన 54.25 సగటుతో 434 పరుగులు చేసింది. ఇందులో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. జెమిమా రోడ్రిగ్స్ 58.40 సగటుతో 292 పరుగులు చేసింది. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై 127 పరుగులతో అజేయంగా నిలిచి.. టీమిండియా ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించింది. ఇక దీప్తిశర్మ 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'గా ఎంపికైంది. బ్యాటింగ్‌లో 215 పరుగులు చేయడంతో పాటు బంతితోనూ రాణించి 22 వికెట్లు పడగొట్టింది. ఫైనల్లో 58 పరుగులు, ఐదు వికెట్లతో రాణించింది. దక్షిణాఫ్రికా నుంచి లారా వోల్వార్డ్ (కెప్టెన్), మారిజాన్ కాప్, నాడిన్ డి క్లెర్క్ చోటు దక్కించుకున్నారు. వోల్వార్డ్ 71.37 సగటుతో 571 పరుగుల చేసింది. వుమెన్స్ వరల్డ్ కప్‌లో ఒకే ఎడిషన్‌లో అత్యధిక పరుగుల రికార్డులను బ్రేక్ చేసింది.

జట్టు: వోల్వార్డ్ (కెప్టెన్-దక్షిణాఫ్రికా), మంధాన, సిద్రా నవాజ్(వికెట్ కీపర్, పాకిస్తాన్), రోడ్రిగ్స్, దీప్తి శర్మ (భారత్), మారిజానే కాప్, డి-క్లార్క్(దక్షిణాఫ్రికా), గార్డినర్, సదర్లాండ్, కింగ్(ఆస్ట్రేలియా), సోఫీ ఎక్లేస్టోన్(ఇంగ్లండ్), 12వ ప్లేయర్ : నాట్ స్కైవర్ బ్రంట్ (ఇంగ్లండ్).

బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్‌కు మొండిచెయ్యి

సెంట్రల్ కాంట్రాక్టులు ప్రకటించిన ఇసిబి

లండన్: యాషెస్ సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు(ఇసిబి) ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్టు జాబితాను మంగళవారం ప్రకటించింది. సీనియర్లకు పెద్ద పీట వేసిన ఇసిబి అంతర్జాతీయంగా సత్తా చాటిన యువకెరటాలకు కూడా కాంట్రాక్ట్‌లో చోటు కల్పించింది. టెస్టు సారథి బెన్ స్టోక్స్‌కు మూడు ఫార్మాట్లలో చోటుతోపాటు రెండేళ్ల క్రాంట్టాక్ లభించింది. పవర్ హిట్టర్లు జానీ బెయిర్‌స్టో, లియాం లివింగ్‌స్టోన్‌లకు సెంట్రల్ కాంట్రాక్ట్‌లో చోటు దక్కకపోవడం అందరినీ ఆశ్చర్యపర్చింది. అలాగే స్పిన్నర్ జాక్ లీచ్, పేసర్ ఓలీ స్టోన్‌లకు ఈసారి కాంట్రాక్ట్‌లో చోటు దక్కలేదు. పేసర్ మార్క్ వుడ్‌తో పాటు జూనియర్లకు ఏడాది కాలానికే కాంట్రాక్ట్ ఇస్తున్నట్టు ఇసిబి ప్రకటించింది. స్పిన్ ఆల్‌రౌండర్ డాసన్, సాకిబ్ మహమూద్, పొడగరి పేసర్ జేమీ ఓవర్టన్‌లు మొదటిసారి ఇసిబి నుంచి జీతం అందుకోనున్నారు. ఈ కాంట్రాక్ట్ 2025 అక్టోబర్ నుంచి 2026 సెప్టెంబర్ వరకూ కొనసాగనుంది.

రెండేళ్ల కాంట్రాక్ట్ : బెన్ స్టోక్స్, ఆర్చర్, అట్కిన్సన్, బేథెల్, బ్రూక్, బట్లర్, కార్సే, సామ్ కరన్, డకెట్, విల్ జాక్స్, ఆదిల్ రషీద్, రూట్, జేమీ స్మిత్, జోష్ టంగ్. **ఏడాది కాంట్రాక్ట్ :** రెహ్మాన్ అహ్మద్, బేకర్, బషీర్, క్రాలే, డాసన్, మహమూద్, ఓవర్టన్, పోప్, పాట్స్, పోప్, సాల్ట్, వుడ్, ల్యూక్ వుడ్. **చోటు దక్కని ఆటగాళ్లు:** బెయిర్‌స్టో, జాక్ లీచ్, లివింగ్‌స్టోన్, టోప్లే, టర్నర్. **డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్:** జోష్ హల్, ఎడ్డీ జాక్, టామ్ లావెస్, మిచెల్ స్టాన్లీ.

మంధాన, రోడ్రిగ్స్, రాధాలను సన్మానించనున్న మహారాష్ట్ర ప్రభుత్వం

ముంబయి: వన్డే ప్రపంచకప్ నెగ్గిన భారత జట్టులోని ముగ్గురు ఆటగాళ్లను సత్కరించడంతో పాటు నజరానా ఇవ్వనున్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అధ్యక్షతన మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మహారాష్ట్రకు చెందిన ముగ్గురు క్రికెటర్లను సత్కరించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సిఎం ఫడ్నవీస్‌తో పాటు డిప్యూటీ సిఎంలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ పాల్గొన్నారు. స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, రాధా యాదవ్‌లను ఘనంగా సత్కరించడంతో పాటు నజరానా ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. టీమిండియా ప్రపంచకప్‌ను సాధించడంపై కేబినెట్ ప్రశంసలు కురిపించింది.

సరికొత్తగా తెరకెక్కిన సినిమా 'కృష్ణలీల' : దేవన్



'నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే రెండు సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. కొత్త క్యారెక్టర్స్ కోసం ఎదురు చూస్తున్నప్పుడు నిర్మాత జ్యోష్న, రైటర్ అనిల్ 'కృష్ణలీల' కథ చెప్పారు. వారం రోజుల తర్వాత ఈ జనరేషన్‌కి ఈ కథని ఎలా చెప్పొచ్చో కొన్ని మార్పులు చేసి, ఓ కొత్త రకం స్క్రీన్ ప్లేతో చెప్పాను. అది వారికి చాలా నచ్చింది. నేనే డైరెక్ట్ చేస్తానని చెప్పడంతో వాళ్లు కూడా చాలా హ్యాపీగా ఫీలయ్యారు. నాకు దర్శకత్వంలో అనుభవం లేదు. కానీ కథ, స్క్రీన్‌పై మంచి అవగాహన ఉంది. అదే నమ్మకంతో డిఓపి చోటా కె నాయుడును కలిశాను. ఆయన కథ విని, చాలా ఎగ్జైట్ అయ్యారు. ఎంతో ఎంకరేజ్ చేశారు. లీల అంటే ఆట. కృష్ణుడు ఒక ప్రేమ కథని ఎలా ఆడారు? అనేది చాలా ఆసక్తికరంగా చూపించాను. మన ప్రతి పనికి ఒక డెస్టినీ ఉంటుంది. మనం కలిసే ప్రతి వ్యక్తితో మనకు ఒక ఎటాచ్‌మెంట్ ఉంటుంది. ఇందులో ఆ ఎలిమెంట్‌ని చాలా కొత్తగా చూపించాం' అని కథానాయకుడు, దర్శకుడైన దేవన్ అన్నారు. దేవన్, ధన్య బాలకృష్ణన్ జోడీగా నటించిన చిత్రం 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ట్యాగ్‌లైన్. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్‌పై జ్యోత్స్న జి దీన్ని నిర్మించారు. ఈనెల ఏడోతేదీన ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా కథానాయకుడు దేవన్ మీడియాతో ముచ్చటించారు.



కుటుంబ ప్రేమకథా చిత్రం 'పిఠాపురంలో'

'కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారు మోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలూ చాలా బాగా వచ్చాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్ వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన 'మూవీమొఘల్' డి.రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని దర్శకుడు మహేష్ చంద్ర తెలిపారు.

డాక్టర్ రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ, దాసరి పద్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా, జూనియర్ పవన్ కళ్యాణ్, జెడివి ప్రసాద్, కెఎ పాల్ రాము, జబర్దస్త్ శేషు ఇందులో ప్రధాన తారాగణం.

కథ ఆకుల సురేష్‌పటేల్, కథ, డైలాగులు శ్రీరామ్ ఏదోటి, ఎడిటర్ బి.సత్యనారాయణ. సంగీతం జిసి క్రిష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అంజి సంద్రాల, నిర్మాతలు దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళీ (గోదారి కిట్టయ్య), స్క్రీన్ ప్లే, దర్శకత్వం మహేష్‌చంద్ర. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా మహేష్‌చంద్ర మీడియాతో మాట్లాడారు.



సందేశం ప్రజల్లోకి చేరుతోంది : సిద్ధూ వర్మ

'సమాజంలోని కుల వ్యవస్థ పునాదులను పెకిలించేలా మా 'చౌదరి గారి అమ్మాయి' సినిమాలో ఇచ్చిన సందేశాన్ని ప్రేక్షకులు చక్కగా ఆదరిస్తున్నారు. కుల, మత, ప్రాంతీయ బేధాలు వద్దు. ప్రతి మనిషిలోనూ మంచితనం, మానవత్వం ఉంటే చాలు అనే భావన చక్కగా ప్రజెంట్ చేయగలిగాం. ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని కథానాయకుడు వినయ్‌తేజ్, దర్శకుడు సిద్ధూ వర్మ కాకాని అన్నారు. ఎల్లో టకోమా ప్రొడక్షన్ బ్యానర్‌లో ఎడ్‌కాన్ ప్లస్ సంస్థ నిర్మించిన సినిమా 'చౌదరి గారి అమ్మాయి' సినిమా ఈనెల రెండో తేదీన విడుదలైంది. చిత్ర యూనిట్ విజయోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సిద్ధూ వర్మ కాకాని, వినయ్‌తేజ్ మాట్లాడారు. మిగతా చిత్ర యూనిట్ ప్రతినిధులంతా హాజరయ్యారు.

7న తెలుగు 'ఫీనిక్స్' విడుదల



విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా వెండితెరపై ఎంట్రీ ఇచ్చేశాడు. అతను నటించిన తొలి సినిమా తమిళ్‌లో 'ఫీనిక్స్' పేరుతో ఇప్పటికే విడుదలైంది. అక్కడ ఫర్వాలేదనిపించిన ఈ మూవీ ఇప్పుడు ఇదే టైటిల్‌తో తెలుగులో కూడా విడుదల కానుంది. ఈ క్రమంలో తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీని రాజ్యలక్ష్మి అనల్ అరసు నిర్మించారు. జూలై 4న తమిళ్‌లో విడుదలైన ఈ చిత్రం ఇప్పటికే అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగు వర్షన్ ఈనెల ఏడోతేదీన థియేటర్లలో విడుదల కానుంది. హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్మాతలు నిర్వహించారు. ఫీనిక్స్ సినిమాలో యాక్షన్‌తో పాటు అద్భుతమైన ఎమోషన్ కూడా సూర్య సేతుపతి పండిచాడు. వరలక్ష్మీ శరత్‌కుమార్ ఒక కీలకమైన పాత్రలో నటించారు. మీడియా సమావేశంలో విజయ్ సేతుపతి మాట్లాడుతూ తన కుమారుడు ఒక మంచి సినిమాతో తెలుగులో పరిచయం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

ఆంధ్ర ఘన విజయం

- ఒడిషా ఇన్నింగ్స్ 50 పరుగుల తేడాతో ఓటమి
- రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్

కటక్: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-ఎలో ఆంధ్రప్రదేశ్ జట్టు ఘన విజయం సాధించింది. ఒడిషాపై ఇన్నింగ్స్ 50 పరుగుల తేడాతో విజయం సాధించి పూర్తి పాయింట్లు సొంతం చేసుకుంది. ఫాలో ఆన్ ఆడుతూ ఒడిషా జట్టు మంగళవారం రెండో ఇన్నింగ్స్‌లో 274పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 190 పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఒడిషా జట్టు మరో 84పరుగులు జతచేసి 8వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ చౌదరి(80), పట్నాయక్(63), ధూపర్(39) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఆంధ్ర బౌలర్లు విజయ్, సౌరభ్ కుమార్‌కు మూడేసి, సాయితేజ, శశికాంత్, పృథ్వీరాజ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సౌరభ్ కుమార్‌కు దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 7వికెట్ల నష్టానికి 475పరుగులకు ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. ఒడిషా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 151పరుగులకే ఆలౌటై.. ఫాలోఆన్ ఆడింది.

అభిరథ్ భారీ శతకం: హిమాచల్‌పై హైదరాబాద్ గెలుపు

రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-డిలో హిమాచల్‌ప్రదేశ్‌పై హైదరాబాద్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. హైదరాబాద్ ఓపెనర్ అభిరథ్ రెడ్డి(175) అజేయ శతకానికి తోడు వికెట్ కీపర్ రాహుల్ రాధేశ్(66) అర్ధసెంచరీతో రాణించారు. దీంతో హిమాచల్‌ప్రదేశ్ నిర్దేశించిన 347పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ జట్టు 6వికెట్లు కోల్పోయి ఛేదించింది. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్లు ఆర్యమాన్ సింగ్‌కు మూడు, వైభవ్ అరోరా, మయాంక్ దగర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అభిరథ్ రెడ్డికి దక్కింది.

డిసెంబర్15లోగా నివేదిక సమర్పించండి


- బస్సు ప్రమాద ఘటనపై రవాణా శాఖ కార్యదర్శికి హెచ్ఆర్సి నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మానవహక్కుల కమిషన్ స్పందించింది. ఈ ఘటనను సుమోటోగా తీసుకున్న కమిషన్.. డిసెంబర్ 15 లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు మంగళవారం నోటీసులు ఇచ్చింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టిసి ఎండిలను నివేదిక పంపాలని ఆదేశించింది. సోమవారం ఉదయం మీర్జాగూడ గేటు వద్ద ఆర్టిసి బస్సును టిప్పర్ ఢీ కొన్న ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోగా 24 మందికి గాయాలైన సంగతి తెలిసిందే.

సోషల్ మీడియాకు బానిసలుగా మార్చే కుట్ర

- మోడీపై రాహుల్‌గాంధీ విమర్శ


ఔరంగబాద్ సభలో అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ, నాయకులు



పాట్నా : సోషల్ మీడియాకు బానిసలుగా యువతను మార్చేందుకు ప్రధాని మోడీ కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ విమర్శించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిదశకు చివరి రోజైన మంగళవారం ఔరంగాబాద్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో ప్రసంగించారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి సమస్యలపై యువత దృష్టి పెట్టకూడదని ప్రధాని కోరుకుంటున్నారని అన్నారు. 'యువత రీల్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లకు బానిస కావాలని మోడీ కోరుకుంటున్నారు. ఇది 21 శతాబ్దపు కొత్త ఎత్తు. యువత పరధ్యానంలో ఉండటం, విద్య, ఆరోగ్యం, ఉపాధికి సంబంధించిన సమస్యలకు ఎన్‌డిఎ ప్రభుత్వానికి జవాబుదారీతనం లేకుండా ఉండాలని మోడీ కోరుకుంటున్నారు' అని రాహుల్ పేర్కొన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ ఓటమి గురించి తెలిసే.. అమిత్ షా, మోడీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నారని అన్నారు. ఎన్‌డిఎ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ రాష్ట్రంలోని యువతను వలస కార్మికులుగా మారుస్తున్నారని విమర్శించారు. 'బీహార్‌లో ఇండియా బ్లాక్ ప్రభుత్వం వస్తే అత్యంత వెనుకబడిన, సామాజికంగా అణగారిన, దళితుల ప్రభుత్వంగా ఉంటుంది' అని రాహుల్ తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నలంద ఉండేదని, ఇక్కడ చైనా, జపాన్, కొరియా తదితర దేశాల విద్యార్థులు చదువుకునేవారని అన్నారు. మోడీకి ఇలాంటి వాటిపట్ల ఆసక్తి లేదని, ఎందుకంటే ఆయనకు నకిలీ డిగ్రీ ఉందని అన్నారు.

ఎన్‌డిఎ పాలనలో మహిళలకు రక్షణ కరువు : ఖర్గే

ఎన్‌డిఎ ప్రభుత్వ పాలనలో బీహార్ మహిళలకు భద్రత కరువైందని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. బీహార్ మహిళల సాధికారత, ఆర్థిక అభ్యున్నతికి మహాగట్‌బంధన్ పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. మహిళలతోపాటు రాష్ట్రంలో చిన్నారుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) డేటా ప్రకారం బీహార్‌లో 70 శాతం చిన్నారులు రక్తహీనతతోనూ, 40 శాతం మంది పోషకాహార లోపంతోనూ బాధపడుతున్నారని తెలిపారు.

ప్రాణాలు తోడేస్తున్న విద్యాసంస్థలు

- ఒకేరోజు నలుగురు విద్యార్థులు ఆత్మహత్య
- యాజమాన్యం వేధింపుల వల్ల ఇద్దరు
- చదువు ఒత్తిడిని తట్టుకోలేక మరో ఇద్దరు


రుద్రమూర్తి (ఫైల్)


కోండ్రు కార్తీక్ (ఫైల్)


రోదిస్తున్న బంధువులు

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల ప్రాణాలను తోడేస్తున్నారు. రాష్ట్రంలో మంగళవారం నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. చదువు ఒత్తిడిని తట్టుకోలేక కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరు, యాజమాన్య వేధింపుల వల్ల చిత్తూరు జిల్లాలో ఒకరు, ఫీజు చెల్లించాలనే ఒత్తిడి వల్ల తిరుపతి జిల్లాలో ఒకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబసభ్యుల కథనం ప్రకారం... చిత్తూరు నగరంలోని సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అదే నగరంలోని సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన రుద్రమూర్తి (19) బిటెక్ డేటా సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్నారు. కళాశాల భవనంలోని మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. యాజమాన్యం వేధింపుల కారణంగానే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడంటూ మృతుని తల్లి తులసి, బంధువులు, స్నేహితులు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, కళాశాల హెచ్ఒడి సమాధానం చెప్పాలని కోరుతూ కళాశాల ఎదుట బైఠాయించారు. సిఐ నిత్యాబాబు, పూతలపట్టు సిఐ కత్తి శ్రీనివాసులు అక్కడికి చేసుకొని సిసి ఫుటేజ్ ఇస్తామని, విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, ఇదే కళాశాలకు చెందిన బిటెక్ మూడో సంవత్సరం విద్యార్థిని కూడా ఇదే కారణంతో వారం రోజుల క్రితం కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఆమె తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

తిరుపతి-రేణిగుంట మార్గంలోగల చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్‌సి బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సాయి చందు (20) కళాశాల హాస్టల్ భవనంపై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కళాశాల ఫీజు కట్టాలని, మంగళవారం ఉదయం రావాలని ఆ విద్యార్థి నెల్లూరు జిల్లా స్టోన్‌హౌస్‌పేటలో ఉంటున్న తన తండ్రి శ్రీనివాసులుకు సోమవారం రాత్రి ఫోన్ చేశారు. దీంతో, శ్రీనివాసులు మంగళవారం హాస్టల్ గదికి వెళ్లగా, అక్కడ తన కుమారుడు కనిపించపోవడంతో అతని స్నేహితుడిని అడిగారు. మిద్దెపైకి వెళ్లాడని చెప్పడంతో అక్కడికి వెళ్లి చూడగా చందు ఉరి వేసుకుని ఉండడానికి గుర్తించి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరు పంచాయతీ సీతయ్యపేటకు చెందిన కోండ్రు కార్తీక్ (15) తునిలోని ఓ ప్రయివేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. పాఠశాలకు చెందిన హాస్టల్‌లోనే ఉంటూ తరగతులకు హాజరవుతున్నారు. సోమవారం రాత్రి స్టడీ రూములో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన యాళ్ల సత్యదేవ్‌కుమార్ (18) తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేటు విద్యా సంస్థలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల ఆ విద్యార్థి తన ఇంటికి వెళ్లారు. మంగళవారం సత్యదేవ్‌ను ఆయన తండ్రి ప్రసాద్ కళాశాలలో దింపి ఇంటికి వెళ్లారు. అంతలోనే కాలేజీలో సత్యదేవ్‌కుమార్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కాలేజీ యాజమాన్యం నుంచి ఆయనకు ఫోన్ వచ్చింది. ఈ ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యకు చదువు ఒత్తిడే కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

సర్ ప్రక్రియ షురూ

- 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ
- ప్రతిపక్షాల అభ్యంతరాలు పట్టని ఇసి
- సుప్రీంకోర్టులో సర్ కేసు పెండింగ్

న్యూఢిల్లీ : స్పెషల్ ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ) మంగళవారం ప్రారంభించింది. 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో సర్ అమలుకు చర్యలు చేపట్టింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, పుదుచ్చేరి, అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో దాదాపు 51 కోట్ల మంది ఓటర్లను సర్ కవర్ చేయనున్నది. వీటిలో, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ , పుదుచ్చేరి 2026లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది బీహార్‌లో సర్ ప్రక్రియ చేపట్టి.. 68 లక్షలకు పైగా పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించింది.

ప్రక్రియ ఇలా..

ఇంటింటికి వెళ్లి గణన ప్రక్రియ మంగళవారం నుంచి డిసెంబర్ 4 వరకు జరుగుతుంది. డిసెంబర్ 9న ఇసిఐ ముసాయిదా జాబితాలను ప్రచురించనున్నది. ఆ తర్వాత డిసెంబర్ 9 నుంచి జనవరి 8 వరకు వాదనలు, అభ్యంతరాలను సమర్పించవచ్చు. దానికనుగుణంగా నోటీసులు జారీ చేయబడతాయి. డిసెంబర్ 9 నుంచి జనవరి 31 వరకు విచారణలు , ధ్రువీకరణలు జరుగుతాయి. తుది ఓటర్ల జాబితాలు ఫిబ్రవరి 7న ప్రచురించనున్నట్లు ఇసి ప్రకటించింది.

ప్రతిపక్షాల అభ్యంతరం

మోడీ సర్కార్ ఆదేశాలకు అనుగుణంగా ఇసిఐ వ్యవహరిస్తోందని ప్రతిపక్షాలు విమర్శించాయి. సుప్రీంకోర్టులో కూడా సర్ కేసు పెండింగ్‌లో ఉన్నది. తీర్పు వచ్చే వరకు ఆగకుండా బుల్డోజ్ రాజకీయాన్ని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోందన్న విమర్శిస్తున్నాయి. తాజాగా డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా సుప్రీంలో సర్‌కు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విషయంలో తీర్పు వచ్చాకే సర్‌ను అమలుచేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో ఓట్లు తొలగించేలా మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించాయి.


పి.హిందుజా(ఫైల్)

హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ ఇకలేరు

న్యూఢిల్లీ : అశోక్ లేలాండ్ మాతృసంస్థ హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ పి హిందుజా (85) కన్నుమూశారు. లండన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన గత కొన్ని వారాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హిందుజా కుటుంబంలో రెండో తరానికి చెందిన గోపీచంద్ 2023లో గ్రూప్ సంస్థలకు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన సోదరుడు శ్రీచంద్ మరణానంతరం ఆ బాధ్యతలు స్వీకరించారు. గోపీచంద్ హిందుజాకు భార్య సునీత, కుమారులు సంజయ్, ధీరజ్, కుమార్తె రీటా ఉన్నారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచే వ్యాపార రంగంలో ఉన్న హిందుజా గ్రూప్‌లోకి 1959లో గోపీచంద్ చేరారు.

అమెరికా నుంచి భారీగా చమురు కొనుగోలు

- అక్టోబర్‌లో ఐదేళ్ల గరిష్టానికి చేరిక
- రోజుకు 5.68 లక్షల బ్యారెళ్లు
- ట్రంప్ షరతులకు తలొగ్గిన మోడీ



న్యూఢిల్లీ : అమెరికా నుంచి చమురు దిగుమతులు నూతన రికార్డులను చేరాయి. ఇటీవల యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలకు ప్రధాని నరేంద్ర మోడీ తలొగ్గి ఆ దేశం నుంచి భారీగా చమురు కొనుగోళ్లను పెంచారు. చౌకగా లభించే రష్యా చమురును తగ్గించడం గమనార్హం. ఈ ఏడాది అక్టోబర్ అమెరికా నుంచి భారత్‌కు గత నాలుగేళ్లలో ఎప్పుడూ లేని స్థాయి గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. డేటా అనలిటిక్స్ సంస్థ కెప్లర్ నివేదిక ప్రకారం.. అక్టోబర్‌లో యుఎస్ నుంచి భారత్ రోజుకు సగటున 5,68,000 బ్యారెల్స్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. 2021 మార్చి తర్వాత ఈ స్థాయిలో దిగుమతులు జరగడం ఇదే మొదటిసారి. సెప్టెంబరులో దిగుమతులైన 2,07,000 బ్యారెల్స్‌తో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ కావడం ఆందోళనకరం. ఇది ట్రంప్ ఆంక్షలకు భారత్ తలొగ్గిందనడానికి నిదర్శనమని నిపుణులు భావిస్తున్నారు.

భారతదేశం మొత్తం ముడి చమురు దిగుమతుల్లో యుఎస్ వాటా 12 శాతానికి పెరిగింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో ఇది 4.5 శాతంగా ఉంది. అమెరికా నుంచి దిగుమతులు పెరిగినప్పటికీ.. రష్యా ఇప్పటికీ భారతదేశానికి అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా కొనసాగుతోంది. అక్టోబర్‌లో భారత్ దిగుమతుల్లో రష్యా వాటా 34 శాతంగా ఉండటం విశేషం. రష్యా నుంచి రోజుకు 16.2 లక్షల బ్యారెల్స చమురు దిగుమతి అయ్యింది. ఇరాక్, సౌదీ అరేబియా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ట్రంప్ ఆదేశాల మేరకు రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదు. అమెరికాకు సహకరిస్తామన్న ప్రధాని మోడీ హామీ మేరకు భారత రిఫైనరీలు అమెరికా కంపెనీల నుంచి చమురు బుకింగ్ పెంచుకున్నట్లు వాణిజ్య, ప్రభుత్వ వర్గాల సమాచారం.

ఎన్యుమరేషన్లో అక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)

చెబుతున్నారని తెలిపారు. దీంతో, రైతులకు పరిహారం అందడంలేదన్నారు. పరిహారం తీసుకున్న రైతుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయబోదని కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడం చూస్తే, రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం ప్రేమ ఉందో అర్థమవుతోందని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో 16 సార్లు వాయుగుండాలు, అల్పపీడనాలు, తుపానులు ఏర్పడి అకాల వర్షాలు, భారీ వర్షాలతో రైతులు నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఒక్కసారి కూడా నష్టపరిహారంగానీ, బీమాగానీ అందించలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.7,500 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామని, రూ.7,800 కోట్లకుపైగా పంటల బీమా అందించామని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ తీరుతో రైతులు యూరియాను బ్లాక్‌లో కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చి వాటిని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, వైసిపి కృష్ణా జిల్లా అధ్యక్షులు పేర్ని వెంకట్రామయ్య (నాని), ఎంఎల్‌ఎ తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యేలు కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), వల్లభనేని వంశీ, కైలే అనీల్‌కుమార్, దూలం నాగేశ్వరరావు, సింహాద్రి రమేష్‌బాబు, వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, ఆ పార్టీ మచిలీపట్నం, పెడన, పెనమలూరు ఇన్చార్జులు పేర్ని కిట్టు, రాము, దేవభక్తుని చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం రైతులకు రూ.3 కోట్లు

- విడుదల చేసిన ఎన్‌బిఎ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలోని ఎర్ర చందనం పండించే రైతులను ప్రోత్సహించే లక్ష్యంతో జాతీయ జీవవైవిధ్య అథారిటీ (ఎన్‌బిఎ) రూ.3 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తం రాష్ట్రంలో 198 మంది రైతులు, ఆంధ్ర యూనివర్సిటీకి విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం పర్యావరణం, అటవీ మంత్రిత్వశాఖ ప్రకటన విడుదల చేసింది. సమ్మిళిత జీవవైవిధ్య పరిరక్షణను ప్రోత్సహించడానికి ఎన్‌బిఎ చేపట్టిన ప్రయోజనాలను పంచుకునే చర్యల శ్రేణిపై ఆధారపడి ఉంటుంది. సాగు చేసిన ఎర్ర చందనం కలప పరిమాణాన్ని బట్టి ఒక్కో రైతుకు రూ.33 వేలు నుంచి రూ.22 లక్షల వరకు మొత్తాన్ని అందుకుంటారు. కలప అమ్మకపు విలువ కంటే లబ్ధిదారులు ఎక్కువ మొత్తాలను అందుకుంటున్నారని మంత్రిత్వశాఖ తెలిపింది. లబ్ధిదారులు ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు (చిత్తూరు, నెల్లూరు, తిరుపతి, కడప) జిల్లాల్లోని 48 గ్రామాలకు చెందినవారు. చిత్తూరు జిల్లాలోని ఎగువరెడ్డి, వారిపల్లె, నల్లమానుకాలువ, రాళ్లకుప్పం, వరత్తూరు, కండ్రిగ, వెంగల్రాజుకుప్పం, పురం, అంబకం, పెరుమాళ్లపల్లి, మంబేడు, దుర్గసముద్రం, సీతారామపురం, మెరియపాక, మిటప్లెం, ఆలత్తూరు, శ్రీరంగరాజపురం, చిన్నటయ్యూరు, నెల్లూరు జిల్లాలోని తాళ్లపల్లి, తిరుపతి జిల్లాలోని చెర్లోపల్లి, పెద్దమల్లెల, మోటుమల్లెల, రొంపిచెర్ల, వడమాలపేట, కరూరు, పులికుంద్రం, శివగిర్, పిచ్చాటూరు, అరూరు, పాలమంగళం, వడమాలపేట, శ్రీబరిపురం, పాత ఆర్కాట్, కెబిఆర్ పురం, కాకవేడు, పనపాకం, దామలచెరువు, కళ్యాణపురం, గాదంకి, కడప జిల్లాలోని చలివెందుల, వెంకటంపల్లి, దండ్లోపల్లి, పుతనవారిపల్లి, కేతరాజుపల్లె, వల్లూరుపల్లి, అనంతయ్యగారిపల్లి, పుల్లంపేట్, తిమ్మసముద్రం గ్రామాల రైతులకు ఈ ప్రోత్సాహం అందుతుంది. గతంలో రెడ్ సాండర్స్ రక్షణ, పరిరక్షణ కోసం రాష్ట్ర అటవీశాఖ, కర్ణాటక అటవీశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య బోర్డుకు రూ.48 కోట్లు, తమిళనాడులోని రైతులకు రూ.55 లక్షలు ఎన్‌బిఎ విడుదల చేసింది.

ఆన్‌లైన్ గేమింగ్ చట్ట పరిధి నుండి రెగ్యులర్ పోటీలు, టోర్నమెంట్‌లకు మినహాయింపు

- సుప్రీం సూచన

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ గేమింగ్ చట్టం పరిధి నుండి రెగ్యులర్ పోటీలు, టోర్నమెంట్‌లను మినహాయించవచ్చని సుప్రీంకోర్టు మౌఖికంగా సూచన చేసింది. బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నిర్వచనం పరిధి కిందకు అవి రావని, అందువల్ల వాటిని ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025 నుండి మినహాయించవచ్చని పేర్కొంది. రియల్ మనీ గేమ్స్‌ను సంబంధిత బ్యాంకింగ్ సేవలు, వాణిజ్య ప్రకటనలను ఈ చట్టం నిషేధిస్తోంది.

ఆన్‌లైన్‌లో చెస్ ఆడుతూ తన జీవనోపాధిగా మలచుకున్న ఒక చెస్ క్రీడాకారుడు చేసుకున్న అభ్యర్థనపై జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. ఈ చెస్‌కు సంబంధించి తానొక యాప్‌ను కూడా ప్రారంభించాలని అనుకుంటున్నట్లు ఆ చెస్ క్రీడాకారుడు తన అభ్యర్థనలో తెలిపాడు. "భారత్ చాలా వింతైన దేశం... నువ్వు ఒక క్రీడాకారుడివి అని చెబుతున్నావు, అందువల్ల నువ్వు ఆడాలనుకుంటున్నావు, ఇది మాత్రమే నీ ఆదాయ వనరు అంటున్నావు, ఈ ప్రొసీడింగ్స్‌లో చేరాలని భావిస్తున్నావు.. నువ్వు బెట్టింగ్ లేదా గ్యాంబ్లింగ్ చేస్తావా? ఆదాయం ఎలా వస్తుంది నీకు?" అని జస్టిస్ పార్దీవాలా ఆ క్రీడాకారుడిని ప్రశ్నించారు. దానిపై ఆ క్రీడాకారుడి తరపు న్యాయవాది స్పందిస్తూ, తన క్లయింట్ టోర్నమెంట్‌ల్లో పాల్గొనే చెస్ క్రీడాకారుడని చెప్పారు. "అలా అయితే దీని (ఈ చట్టం) వల్ల నీకొచ్చే సమస్యేమీ లేదు. ప్రభుత్వం టోర్నమెంట్‌లకు అభ్యంతరం చెప్పదు. ఈ చట్టం నుండి టోర్నమెంట్‌లను పూర్తిగా బహిష్కరిస్తున్నాం. అటువంటప్పుడు మీరిక్కడకు రావడం ఎందుకు? నిజంగా మీరు ఒక మాట చెప్పండి.. టోర్నమెంట్‌ల్లో మీరు ఆడతారా లేదా?" అని ఆ క్రీడాకారుడిని జస్టిస్ పార్దీవాలా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్.వెంకటరామన్ మాట్లాడుతూ, ఆ పిటిషనర్ టోర్నమెంట్‌ల్లో ఆడడని వ్యాఖ్యానించారు. దీనిపై క్రీడాకారుడి తరపున న్యాయవాది స్పందించారు. తన క్లయింట్ బెట్టింగ్‌ల్లో లేదా గ్యాంబ్లింగ్‌లో పాల్గొనడని చెప్పారు. కంపెనీలు నిర్వహించే ఆన్‌లైన్ టోర్నమెంట్‌లు వుంటాయని, అందులో పాల్గొనడానికి ఫీజు కూడా చెల్లిస్తామని, అలా ఆడి ప్రైజ్ కూడా గెలుచుకున్నానని క్రీడాకారుడు తెలిపాడు. దీంతో కొత్త చట్టాన్ని సవాలు చేస్తూ పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు దాఖలు చేసిన పిటిషన్లతో పాటు ఈ పిటిషన్‌ను కూడా కలిపి విచారించేందుకు జస్టిస్ పార్దీవాలా అంగీకరించారు. అత్యవసంగా విచారించాలని ఆన్‌లైన్ వేదికల తరపున న్యాయవాదులు కోరడంతో ఈ కేసుపై 26న సవివరమైన విచారణ జరపాలని కోర్టు నిర్ణయించింది.

ఈచట్టంపై తాత్కాలికంగా స్టే ఇవ్వాలని గత విచారణ సందర్భంగా కంపెనీల తరపు న్యాయవాది సి.ఎ.సుందరం, రోహిణి మూసా కోరడంతో సమగ్ర కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సిందిగా బెంచ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఆన్‌లైన్ మనీ గేమ్‌ల వల్ల వ్యక్తులు, కుటుంబాలకు, మొత్తంగా దేశానికి తీవ్ర ముప్పు ఎదురవుతోందని ప్రభుత్వం వాదించింది. చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని దోపిడీకి పాల్పడుతూ సామాజిక ముప్పు కలగజేస్తున్నాయని పేర్కొంది.

ఫోర్బ్స్ బెస్ట్ ఎంప్లాయర్స్ జాబితాలో అమరరాజా

హైదరాబాద్ : ఫోర్బ్స్ మ్యాగజైన్ రూపొందించిన 'వరల్డ్స్ బెస్ట్ ఎంప్లాయిస్ 2025' జాబితాలో అమరరాజా గ్రూప్ చోటు దక్కించుకుంది. ఈ జాబితాలో ఆరు భారతీయ కంపెనీలకు స్థానం లభించగా.. అందులో అమరరాజా గ్రూప్ ఒకటి కావడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన 31 అగ్రశ్రేణి సంస్థల్లో 28వ స్థానంలో నిలిచింది. ఉద్యోగుల పట్ల అమరరాజా నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆ సంస్థ పేర్కొంది. మార్కెట్ రీసెర్చ్ సంస్థ స్టాటిస్టా భాగస్వామ్యంతో ఫోర్బ్స్ 50కి పైగా దేశాలలోని 300,000 మందికి పైగా ఉద్యోగుల నుంచి స్వతంత్ర సర్వేల ద్వారా ఈ జాబితాను రూపొందించింది.

ఎంపిక చేసిన ఎస్‌టి అధికారులతో రహస్య సమావేశం ఎందుకు ?

- సిఎం మాణిక్‌షాపై సిపిఎం విమర్శ

అగర్తలా : ఎంపిక చేసిన కొద్దిమంది ఎస్‌టి అధికారులతో త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ షా రహస్యంగా తన నివాసంలో సమావేశం జరిపారని ఇటీవల మీడియాలో వార్తలు వచ్చాయి. అటువంటి సమావేశం ఏర్పాటు చేయడంపై త్రిపుర ప్రతిపక్షమైన సిపిఎం అనేక ప్రశ్నలను లేవనెత్తింది. ప్రతిపక్ష నేత, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు జితేంద్ర చౌదరి ఇంతకుముందు దీని గురించి సోషల్ మీడియాలో ఒక పోస్టు చేశారు. ఈ సమావేశం గురించి ప్రభుత్వం వివరణ ఇవ్వాలంటూ మరికొన్ని ప్రశ్నలను ఆయన మంగళవారం లేవనెత్తారు. దీనిపై అధికారికంగా ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంపై తాను పెట్టిన పోస్ట్ గురించి మీడియాలో ముఖ్యంగా స్థానిక దినపత్రికల్లో, ప్రజల్లో మంచి చర్చ జరిగిందని జితేంద్ర చెప్పారు. ఈ చర్చను తాను స్వాగతిస్తున్నానన్నారు.

సెక్రటేరియట్‌కు ప్రశ్నలు సంధించిన జితేంద్ర చౌదరి

ఈ సమావేశం వల్ల తలెత్తిన వివాదాలకు ముగింపు పలికే ఉద్దేశంతో తాను ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌ను కొన్ని ప్రశ్నలు అడుగుతున్నానని, వాటికి సమాధానం కావాలని జితేంద్ర చౌదరి ఆ ప్రకటనలో కోరారు. ఒక ప్రత్యేక కమ్యూనిటీ లేదా ప్రాంతానికి సంబంధించిన సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వ విభాగాలతో మెరుగైన సమన్వయం కోసమే ఈ సమావేశం జరిగినట్లైతే, అది ఏ విభాగానికి సంబంధించిందో వెల్లడించాలన్నారు.

ఒకవేళ ఇది ముఖ్యమైన, ఉన్నత స్థాయి అధికారిక సమావేశమే అయి వుంటే చీఫ్ సెక్రటరీ కానీ లేదా సీనియర్ మోస్ట్ ప్రిన్సిపల్ కార్యదర్శి కానీ ఎందుకు హాజరు కాలేదు? అని ప్రశ్నించారు. పైగా ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొన్నారు కాబట్టి ఇది ఉన్నత స్థాయి సమావేశమేనని ఈ సందర్భంగా జితేంద్ర వ్యాఖ్యానించారు. రిటైరై పోయినా గవర్నర్‌కు కార్యదర్శి హోదాలో పనిచేస్తున్న ఉత్తమ్ చక్మా ఆ సమావేశంలో పాల్గొన్నారని ఆయన తెలిపారు. సాధారణంగా ప్రభుత్వంలో అనుసరించే పద్ధతులు, ప్రామాణికాల ప్రకారం, బ్లాక్ స్థాయిలో పలు రంగాలు, విభాగాలకు చెందిన ఏ చిన్న సమావేశం జరిగినా అందుకు సంబంధించిన మినిట్స్‌ను, సమావేశానికి ఎవరెవరు హాజరయ్యారనేది వెంటనే నోడల్ డిపార్ట్‌మెంట్ ప్రచురిస్తుంది. మరి ఈ సమావేశానికి సంబంధించి మినిట్స్, హాజరైన వారి వివరాలు ప్రచురించారా అని జితేంద్ర ఆ ప్రకటనలో ప్రశ్నించారు.

భారత్ విద్యార్థులకు వీసాల తిరస్కరణ

- అంతర్గత భద్రత పేరుతో కెనడా ఆంక్షలు

న్యూఢిల్లీ : భారతదేశ విద్యార్థుల వీసాలను కెనడా అధిక సంఖ్యలో తిరస్కరిస్తోంది. ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ సిటిజన్ షిప్ కెనడా (ఐఆర్‌సిసి) సంస్థ ప్రకటించిన డేటా ప్రకారం 2025 ఆగస్టులో 74% భారతీయ విద్యార్థుల పర్మిట్ దరఖాస్తులను కెనడా తిరస్కరించింది. కెనడాలో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. గత సంవత్సరంలో 20 వేలమందికి పైగా విద్యార్థులుంటే ఈ ఏడాది ఆ సంఖ్య 4,515కు తగ్గింది. అంతర్గత భద్రత, మోసపూరిత వీసాలను అరికట్టేందుకే ఆంక్షలని కెనడా ప్రభుత్వం ప్రకటించింది. భారత్‌కు, కెనడాకు మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతినడంతో, దాని ప్రభావం వీసాలపై ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థుల వీసాల తిరస్కరణలో చైనావి 23% కాగా, మిగతా దేశాల తిరస్కరణలు 40% మించిలేవు. దీనిపై కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ స్పందిస్తూ "ఇప్పటికీ కెనడాకు భారతీయ విద్యార్థులు కావాలి. వ్యవస్థ సమగ్రతను కాపాడుకోవాల్సిన అవసరం" ఉందని అన్నారు. కెనడా వీసా ఆంక్షలతో భారత విద్యార్థులు అస్ట్రేలియా, యుకె వంటి దేశాలవైపు చూస్తున్నారు. గత సంవత్సరంతో పోల్చితే ఆ దేశాల్లో వీసాల మంజూరు 15% నుండి 20%కు పెరగటం గమనార్హం.

నైపుణ్య మార్పిడితో ఉమ్మడి పురోగతి

- క్యూబా రాయబారి కార్లోస్‌తో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో


అగులేరా, డియాజ్ పెరెజ్‌తో మంత్రి శ్రీధర్‌బాబు

ద్వైపాక్షిక సహకారం ద్వారా నైపుణ్యాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకొని ఉమ్మడి పురోగతి వైపు అడుగేద్దామని, 'తెలంగాణ - క్యూబా' మధ్య సత్సంబంధాలను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగులేరా, ఫస్ట్ సెక్రటరీ మిక్కీ డియాజ్ పెరెజ్‌తో ఆయన మంగళవారం డా బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. బయో టెక్నాలజీ, ఫార్మా, హెల్త్ కేర్, ఐటి, ఎఐ, ఇన్నోవేషన్, అగ్రికల్చర్, సస్టైనబుల్ ఫార్మింగ్, స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్, కల్చర్ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై చర్చించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున చేస్తున్న కృషిని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. టీ-హబ్, టీ-వర్క్స్, వీ-హబ్ ద్వారా క్యూబా స్టార్టప్స్‌కు మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని, ఎఐ ఆధారిత డయాగ్నోస్టిక్స్, ఫార్మా రీసెర్చ్, పబ్లిక్ హెల్త్ డేటా తదితర అంశాల్లో సహకారం అందిస్తామన్నారు. ప్రపంచంలోని టాప్- 7 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా నిలిచిన 'జీనోమ్ వ్యాలీ'ని సందర్శించాలని క్యూబా ప్రతినిధులను ఆహ్వానించారు. బాక్సింగ్, అథ్లెటిక్స్‌లో క్యూబా నైపుణ్యాన్ని తెలంగాణకు అందించాలని మంత్రి కోరారు. నలూతన ఆవిష్కరణలు, ఇన్నోవేషన్ డ్రివెన్ ప్రోగ్రెసివ్ విధానాలను అవలంభిస్తున్న తెలంగాణ లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగులేరా పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ప్రమోషన్ సెల్ డైరెక్టర్ మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి బస్టాండ్‌పై అదాని కన్ను!

(మొదటిపేజీ తరువాయి)

వ్యూహంలో భాగంగానే ఈ జాప్యం జరుగుతోందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

కూల్చివేత ప్రారంభం..!

టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాకముందే ప్రస్తుతమున్న బస్టాండ్ కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. నెల రోజుల నుండి సెంట్రల్ బస్‌స్టేషన్‌ను కొంచెం,కొంచెం కూల్చివేస్తున్నారు. కొత్త భవనాల నిర్మాణాలకు ముఖ్యమంత్రి త్వరలో శంకుస్థాపన చేస్తారని, మూడు సంవత్సరాల్లో నిర్మాణం పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సిద్ధమైన డిపిఆర్ ప్రకారం 11 అంతస్తులలో నూతన భవన నిర్మాణం జరుగనుంది. 11వ అంతస్తు పై భాగంలో హెలిప్యాడ్ కూడా నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో ఆర్‌టిసి, ప్రైవేటు బస్సులు ఆగడానికి వీలుగా బస్టాండ్, హోటళ్లు, రెస్టారెంట్లు, బ్యాంకులు, కార్యాలయాలు, హెలిప్యాడ్, హైమాక్స్ తదితర అత్యంత అధునాతన వసతులతో ఈ టెర్మినల్‌ను నిర్మించనున్నారు. 150 బస్ ప్లాట్ ఫారాలతోపాటు, స్కూటర్లు, కార్లకు పార్కింగ్ సౌకర్యం, ఎలక్ట్రిక్ బస్సులకు ఛార్జింగ్ సౌకర్యం ఉంటుంది. ఆర్‌టిసికి, ప్రైవేటుకు విడివిడిగా ప్లాట్ ఫారాలు కేటాయించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే 'ఎర్నింగ్ ఫర్ కిలోమీటరు'లో తిరుపతి రీజియన్ మొదటి స్థానంలో ఉంది. రోజుకు రూ.2 కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తున్న తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను ప్రభుత్వం కారుచౌకగా 'కార్పొరేట్ల'కు కట్టబెట్టనుండడంపై ఆర్‌టిసి కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తిరుమల-తిరుపతికి రోజుకు లక్ష మందికిపైగా ప్రయాణికులు, యాత్రికులు వస్తున్నారు. ఇందులో 60 వేల మందికిపైగా ఆర్‌టిసి బస్సుల్లోనే చేరుకుంటున్నారు. ఈ సంఖ్య 2,034 నాటికి లక్ష, 2,052 నాటికి 1.50 లక్షలకు చేరుకొనే అవకాశం ఉందని అంచనా.

రైతులకు ఉచిత విద్యుత్

(మొదటిపేజీ తరువాయి)

చేకూరుస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. పోలీసు సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులతో సహా ప్రభుత్వ ఉద్యోగులందరికీ వారి సొంత జిల్లాల నుంచి 70 కిలోమీటర్ల పరిధిలో నియామకాలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన తొలిదశ ప్రచారం

బీహార్‌లో తొలిదశ ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. తొలిదశలో భాగంగా గురువారం 18 జిల్లాలోని 121 అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశలో 1,314 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, 3 కోట్ల 75 లక్షల మందికిపైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పాట్నాతో సహా దర్భంగా, మధేపుర, సహస్రా, ముజఫర్‌పుర, గోపాల్‌గంజ్, సివాన్, సరన్, వైశాలి, సమస్తిపూర్, బెగుసరాయి, లఖిసరాయి, ముంజెర్, షేక్‌పుర, నలంద, బక్సర్, భోజ్‌పుర జిల్లాలో ఎన్నికలు జరుగుతున్నాయి.




మీ కోసం

పాలను చాలాసేపు కాయడం మర్చిపోతే అవి విరిగిపోయే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఉండాలంటే పొయ్యి మీద పెట్టేటప్పుడు రెండు చుక్కల కొబ్బరినూనె వేయాలి.

జీవన సౌరభం

ప్రశంసలకు ఎక్కువ పొంగిపోతే, విమర్శలను తట్టుకోవడం కష్టమౌతుంది.

కొరివి దెయ్యమా?



'రాముా.. ఏంటి నీరసంగా కన్పిస్తున్నావు?' అని అప్పుడే క్లాసుకి వచ్చిన సైన్సు మాస్టారు అడిగారు. 'ఏమీ లేదు సార్. రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు' అని సమాధానం చెప్పాడు రాము. 'ఏమైంది రామూ?' అని మళ్లీ అడిగారు మాస్టారు. 'రాత్రి మా తాతయ్యను ఒక కథ చెప్పమంటే కొరివి దెయ్యం కథ చెప్పారు. తాను శ్మశానం దగ్గర చాలాసార్లు కొరివి దెయ్యాన్ని చూశానని చెప్పారు సార్. అప్పుడు నేను బాగా భయపడ్డాను' అని రాముా మాస్టారుతో చెప్పాడు. రాముా మాట్లాడుతున్నప్పుడు మిగతా పిల్లల ముఖాల్లో భయాన్ని గమనించారు మాస్టారు.

అప్పుడు 'రాముా వాస్తవానికి కొరివి దెయ్యం అంటూ ఏదీ ఉండదు. దీని వెనుక ఉన్న కారణాన్ని 'విల్–ఓ'–ది–విస్ప్' అని పిలుస్తారు శ్మశానాలు, బురద నేలలు, చిత్తడి నేలల వంటి ప్రాంతాల్లో రాత్రిపూట కనిపించే ఒక రకమైన మసక కాంతినే కొందరు తెలియక కొరివి దెయ్యం అని భ్రమ పడతారు. ఈ ప్రాంతాల్లో చనిపోయిన జంతువులు, సేంద్రీయ పదార్థాలు కుళ్ళిపోవడం వల్ల మిథేన్, పాస్ఫైన్, డైపాస్ఫైన్ వంటి వాయువులు విడుదలవుతాయి. డైపాస్ఫైన్ గాలిలోకి విడుదలైనప్పుడు దానంతటదే మండి, పాస్ఫైన్‌తో కలిసి నీలి రంగులో కాంతిని విడుదల చేస్తుంది. కొన్నిసార్లు ఈ మంటలు ఒక చోటి నుంచి మరో చోటికి గాలి వీచినప్పుడు కదులుతూ ఉంటాయి. ఇది దెయ్యం కదులుతున్నట్లుగా భ్రమ కలిగిస్తుంది. అంతేకాని కొరివి దెయ్యం అంటూ ఏదీ లేదు' అని మాస్టారు వివరించారు. మాస్టారు చెప్పిన విషయాలను శ్రద్ధగా విన్న రాముా, ఇతర పిల్లలు వారిలో ఉన్న భయాన్ని పోగొట్టుకుని హుషారుగా కన్పించారు. పిల్లలని అలా చూసిన మాస్టారు చాలా సంతోషించారు.

- ఎం. రాం ప్రదీప్,
జెవివి సభ్యులు, తిరువూరు, 94927 12836.

ఐ.. ఐ..




అమ్మ
అటుకులు తెచ్చింది
కమ్మగా పాయసం
చేసింది!
నాన్న
బన్నులు తెచ్చాడు
వెన్నపూసి ఇచ్చాడు!
అన్న
గన్ను తెచ్చాడు
పటాసులు పేల్చాడు!
అక్క
కుక్క పిల్లని తెచ్చింది
చక్కిలాలు పెట్టింది!
చెల్లెలు
పల్లీలు కొనింది
గల్లీ అంతా పంచింది!
పిన్ని
అరటిపళ్ళు తెచ్చింది
గిన్ని కేసి తినమంది!
బాబాయి
బొబ్బట్లు తెచ్చాడు
లొట్టలేస్కుని
తినమన్నాడు!

- ఐనకోట రవికుమార్,
ఎంపిపిఎస్ జంగాల కండ్రిగ,
ముత్తుకూరు, నెల్లూరు.
97048 00096.

నేను గీసిన బొమ్మ



బి.జ్ఞానసాయి కార్తీక్, 4వ తరగతి,
విపిఎస్ సిద్ధార్థ పబ్లిక్ స్కూలు, విజయవాడ.




పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సిపిఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



మీకు తెలుసా? హార్ట్ ఎటాక్, కార్డియాక్ అరెస్ట్‌తో ప్రతి 90 సెకన్లకు ఒకరు చనిపోతున్నారనే చేదు నిజం. నేటి ఒత్తిడి సమాజంలో హార్ట్ ఎటాక్ పెద్ద శత్రువు. క్యాన్సర్లు, ఎయిడ్స్, పక్షవాతం.. ఏవైనా సరే.. అవన్నీ గుండె జబ్బుల తర్వాతేనని లెక్కలు చెబుతున్నాయి. ఈ ఆపత్కాలంలో సకాలంలో సీపీఆర్ ప్రక్రియను చేస్తే నిండు ప్రాణాల్ని మనం నిలబెట్టొచ్చు. 'గుండెపోటు, కార్డియాక్ట్ ఆరెస్ట్‌కు గురైన ఆపద సమయంలో ప్రాణాల్ని నిలిపే సీపీఆర్ విధానంపై ప్రజానీకానికి అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నాం' అని విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి పి.చంద్రశేఖర్ చెప్పారు. అక్టోబర్ 19 నుంచి 22 వరకూ నెదర్లాండ్స్‌లోని రొటెర్డామ్‌లో జరిగిన ప్రపంచస్థాయి ఆరోగ్య సదస్సుకు 'ది ఇంటర్నేషల్ లైజాన్ కమిటీ రెసిస్టుటేషన్ (ఐఎల్‌సిఒఆర్)' ఇచ్చిన ఆతిథ్యం మేరకు వెళ్లిన ఆయన సిపిఆర్ వైద్య సేవల గురించి సవివరమైన నివేదికను ప్రవేశపెట్టారు. వివరాలు ఆయన మాటల్లోనే....

ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఎక్కువగా ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్య కార్డియాక్ అరెస్ట్ (ఆకస్మిక గుండెపోటు). చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఈ మధ్య కాలంలో ఈ కేసులు విపరీతంగా పెరిగిపోయాయి. ఎలాంటి జబ్బులు లేకుండా ఆరోగ్యంగా ఉన్న వారు సైతం దీని బారిన పడి ఆకస్మికంగా కుప్పకూలిపోతుంటారు. చికిత్స అందించడం ఏ మాత్రం ఆలస్యమైనా క్షణాల్లో చనిపోతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో గుండెపోటు బాధితులను కాపాడేందుకు ఉన్న తక్షణ మార్గం కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్). ఈ అత్యవసర చికిత్స ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడేందుకు ఎక్కువగా అవకాశాలు ఉన్నాయి. సిపిఆర్ అనే చిన్న ప్రయత్నం ద్వారా ఆకస్మికంగా వచ్చే గుండెపోట్లను 50 శాతం వరకూ తగ్గించొచ్చు. సడెన్ కార్డియాక్ అరెస్ట్ వల్ల మన దేశంలో ఏటేటా 15 లక్షల మంది ప్రాణాలు కోల్పో తున్నారు. సగటున రోజుకి 4000 మంది చనిపోతు న్నట్లు అంచనా. సకాలంలో సిపిఆర్ చేయడం వల్ల చని పోయే వారి సంఖ్యను తగ్గించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కార్డియాక్ అరెస్టయిన వారిలో ప్రతి పది మందిలో ఒకరు మాత్రమే బ్రతుకుతున్నారు. సిపిఆర్ సకాలంలో చేస్తే కనీసం 5 మందిని బతికించుకునే అవకాశం ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ), ఇతర సంస్థలు చెబుతున్నాయి.



అవగాహనే ఆయుధం

కొన్నిసార్లు ఇతర గుండె జబ్బులు, ఆక్సిజన్ తగ్గిపోవడం, కరెంట్ షాక్, పాము కాటు, భయం లాంటి కారణాలు కూడా కార్డియాక్ అరెస్ట్‌కు దారితీయొచ్చు. సమయం, సందర్భం, చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఎవరికైనా సడెన్‌గా కార్డియాక్ అరెస్ట్ వచ్చే ప్రమాదం ఉంటుంది. సిపిఆర్ అనే ప్రక్రియ ద్వారా ఆకస్మిక గుండెపోట్లు వల్ల వ్యక్తులు మరణించకుండా కాపాడిన వారమవుతాం. ప్రాణాపాయంలో ఉన్న వారికి సిపిఆర్ చేసేందుకు చదువు అవసరం లేదు, మెడికల్ పరిజ్ఞానం కూడా తెలియాల్సిన పనిలేదు. ఎవ్వరైనా సిపిఆర్ చేసి ప్రాణాన్ని కాపాడొచ్చు. కొంత అవగాహన, మరికొంత సమయ స్ఫూర్తి ఉంటే చాలు. గుండె పోటుతో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రాణాలు కాపాడే సిపిఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించటంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా కేంద్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 13 నుంచి 17 వరకూ సిపిఆర్ అవగాహనా వారోత్సవాలు జరిగాయి. దేశవ్యాప్తంగా 7.47 లక్షల మంది భాగస్వాములైతే ఒక్క ఎపిలోనే 1.58 లక్షల మంది (21.2 శాతం) పాల్గొన్నారు. 21 శాతంతో హిమాచల్‌ప్రదేశ్ ద్వితీయస్థానంలో నిలిచింది.

పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలు

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఆధ్వర్యంలోని అన్ని మెడికల్ కాలేజీల్లో బిఎల్ఎస్–సిపిఆర్‌పై పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజల్లో కూడా చైతన్యం తీసుకొచ్చేలా ప్రోత్సహిస్తున్నాం. ఈనెల ఒకటో తేదీన జరిగిన యూనివర్శిటీ 39వ వ్యవస్థాపక దినోత్సవం, సెప్టెంబర్ తొమ్మిదో తేదీన జరిగిన యూనివర్శిటీ 27,28వ స్నాతకోత్సవం కార్యక్రమాల్లోనూ ఇదే విషయాలపై కూడా సందేశాలు ఇచ్చాం.

అవగాహన ముఖ్యం

సాధారణంగా మనిషి గుండె కొట్టుకోవాల్సిన వేగం నిమిషానికి 60– 100 సార్లు. గుండె కొట్టుకునే వ్యవస్థ (కండక్టింగ్ సిస్టమ్)లో లోపం వల్ల గుండె వేగం పెరగడం, తగ్గడం, లేక ఒక్కసారిగా గుండె ఆగిపోవడం జరుగుతుంది. ఎవరికైనా అకస్మాత్తుగా గుండె ఆగిపోతే, పక్కన ఉండే వారు దాన్ని మళ్లీ కొట్టుకునేలా చేసే ఒక అత్యవసర ప్రక్రియే ఇది. చెస్ట్ కంప్రెషన్స్, ఎయిర్‌వే పేటెన్సీ, బ్రీతింగ్ ద్వారా దీనిని పూర్తిచేయొచ్చు.

చెస్ట్ కంప్రెషన్స్ : స్పృహ కోల్పోయిన వ్యక్తి రెండు భుజాలను పట్టుకుని ఊపుతూ లేపే ప్రయత్నం చేయాలి. అప్పటికీ లేవకపోతే, గొంతు దగ్గర చేతి వేళ్లతో పల్స్ కోసం చూడాలి. అదీ తెలియకపోతే ఊపిరి తీసుకుంటున్నారా? లేదా? గమనించాలి. ఊపిరి తీసుకోవడం లేదని నిర్ధారణ అయితే ఆ వ్యక్తికి గాలి ఆడేలా చూడాలి. ఒంటి మీదున్న దుస్తులు బిగుతుగా ఉంటే లూజు చేయాలి.



ఎయిర్‌వే పేటెన్సీ బాధితుడి పక్కన మోకాళ్ల మీద కూర్చోవాలి. ఆ వ్యక్తి ఛాతీ మధ్య ఎముక కింద భాగంలో ఒక చేతి మీద ఒక చెయ్యి పెట్టి, వేళ్ళ మధ్య వేళ్ళను పెట్టి మన శరీరం బరువు మొత్తం పడేలా, పైకి లెక్కపెడుతూ నిమిషానికి 100–120 సార్లు ఛాతి మీద ఒత్తాలి. ప్రతిసారి 2–2.5 అంగుళాలు లోపలికి, లేక ఛాతిలో మూడో వంతు లోపలికి వెళ్లి వచ్చేలాగా నొక్కాలి.

బ్రీతింగ్ : సాధారణంగా పడుకొని ఉన్నప్పుడు, ఆ వ్యక్తి నాలుక వెనుకకు పడిపోవడం వల్ల, గాలి ద్వారం మూసుకు పోయే ప్రమాదం ఉంటుంది. గాలి వెళ్లే ద్వారం పూర్తిగా తెరిచి ఉండడానికి, ఆ వ్యక్తి తలను వెనక్కి అని, దవడ పైకి లేపి ఉంచాలి. దానితో గాలి ద్వారం తెరిచి ఉండడం వల్ల, కొంత వరకు గాలి ఊపిరితిత్తులలోకి వెళ్తుంది.

శ్వాస ఆడేలా చూడటం..

- బాధితుడికి ఊపిరి అందించడానికి ఆక్సిజన్ మాస్క్ వెంటనే అందుబాటులో ఉండకపోవచ్చు. అప్పుడు సన్నటి రుమాలు లేక ఏదైనా క్లాత్ అడ్డుగా పెట్టుకొని గాలి అందించొచ్చు.
- నోరు పూర్తిగా నోటితో మూస్తూ, ముక్కును వేళ్ళతో లేదా చెంపతో మూసి, గాలి ద్వారం తెరిచి ఉండేలా తలను పట్టుకొని, ఆ వ్యక్తి ఛాతి పైకి లేచేలా పూర్తిగా ఒక సెకను గాలిని ఊదాలి.
- ప్రతి 30 కంప్రెషన్స్‌కు రెండు సార్లు (30:2) గాలి అందిస్తూ సీపీఆర్‌ను కొనసాగించాలి.
- ఇలా చేయడం చాలా అలసట కలిగిస్తుంది. అందుకే 2 నిమిషాలకు ఒకసారి మరొకరి సాయం తీసుకునే ప్రయత్నం చేయాలి.
- కాసేపటి తర్వాత గుండె కొట్టుకోవడం మొదలైందా లేదా అని మెడ పక్కన వేళ్లు పెట్టి పల్స్ చూడాలి.
- గుండె కొట్టుకోవడం మొదలై, ఊపిరి తీసుకునే వరకు ఇది కొనసాగించాలి.
- అప్పటికీ బాధితుడు స్పృహలోకి రాకపోతే ఒక పక్కకు తిప్పి (రికవరీ పొజిషన్‌లో) పడుకో పెట్టి ఉంచాలి.

ఇంటర్వ్యూ : యడవల్లి శ్రీనివాసరావు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68